# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

29.01.2026 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 201 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


# క్లీన్ స్వీప్ లక్ష్యం

## మున్సిపల్ ఎన్నికల్లోనూ సత్తా చాటుతాం

పార్టీ పనితీరు, గెలుపు అవకాశాలు లక్ష్యంగా ఎంపిక

పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఆధ్వర్యంలో అభ్యర్థుల ఎంపిక



- మున్సిపల్ ఎన్నికలను కాంగ్రెస్ సీరియస్‌గానే తీసుకుంది
- సీఎం లేనప్పుడు మంత్రులు తనను కలవడంలో తప్పులేదు
- అసత్య కథనాలు రాయడం సరికాదు
- మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి

"ప్రజాభవన్ లో మంత్రుల భేటీపై కొందరు పిచ్చి రాతలు రాస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్ అయ్యా రు. సీఎం రేవంత్ దేశంలో లేనందున మున్సిపల్ ఎన్నికలపై తనకు కొన్ని సూచనలు చేశారని తెలిపారు. మంత్రులు వారి సమస్యలు తెలియజేశారని ఆ విషయాలను ముఖ్యమంత్రికి వివరించానని చెప్పారు. మంత్రులు డిప్యూటీ సీఎంను కలవకపోతే రాసే వారితో చూపించే వారితో కలుస్తారా? అని ప్రశ్నించారు. తమ క్యాబినెట్ ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తోందని, అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర భవిష్యత్తు తమ అందరి ఆలోచన లక్ష్యం అని స్పష్టం చేశారు."

**ఖమ్మం, జనవరి 28:** మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. అభ్యర్థుల ఎంపిక కేవలం ఒకరిద్దరి నిర్ణయంగా కాకుండా అత్యంత పారదర్శకంగా, సమిష్టిగా జరగాలని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మంలో మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఆయా మున్సిపాలిటీల బాధ్యతలు చూస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు కలిసి చర్చించి ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఖరారు చేయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత సీరియస్‌గా తీసుకుందని, పార్టీ నేతలంతా సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. అభ్యర్థుల ఎంపికలో అందరినీ కలుపుకుని పోవడం వల్ల పార్టీలో అంతర్గత విభేదాలు రాకుండా ఉంటాయని, ఇది ఎన్నికల్లో గెలుపు అవకాశాలను మరింత మెరుగుపరుస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు.

మిగతా 2 లో



# వికసిత్ భారత్ వైపు..

- పవర్ టెక్నాలజీ హబ్‌గా మారుతున్న భారత్
- 11 ఏళ్లలో ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి
- గ్రీన్ ఎనర్జీ రంగంలో పవర్ హౌస్‌గా భారత్
- పార్లమెంటు ఉభయ సభలో రాష్ట్రపతి ప్రసంగం

4



# బోధనలో నాణ్యత పెరగాలి

- ప్రతి విద్యాసంస్థలో మెరుగైన బోధన
- విద్యాశాఖపై ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష

2



2

# రాష్ట్రంలో సమీకృత రిజిస్ట్రార్ కార్యాలయాలు

## పటాన్‌చెరులో మంత్రులశంకుస్థాపన

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం కర్దనూరులో నూతనంగా నిర్మించనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ పనులకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వివేక్ వెంకట స్వామి శంకుస్థాపన చేశారు.



# సరికొత్త ఆధార్ యాప్

సరళంగా, సురక్షితంగా ఉండేలా చర్యలు

.. వివరాలు 4లో



# వెండి.. 4 లక్షలు

పట్టపగ్గాలు లేని బంగారం, వెండి ధరలు

ఇన్వెస్టర్ల పెట్టుబడులతో ధరల ర్యాలీ

ప్రజలు బంగారం ధరలకే అల్లాడిపోతుంటే వెండి కూడా ఇలా పెరిగి వారికీ నిద్ర లేకుండా చేస్తున్నది. నేడు ఒక్కసారిగా రూ.13,000 పెరిగి తొలిసారి రూ. 4 లక్షల వరకు చేరుకుంది.

.. వివరాలు 4లో

# దానంకు బిగ్ షాక్

- ఫిరాయింపు కేసులో స్పీకర్‌నోటీసులు
- పిటిషన్ వేసిన ఎమ్మెల్యేకు కూడా..
- 30న ఉదయం స్పీకర్ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశం
- సుప్రీం ఆదేశాలతో అనర్హతపై స్పీకర్ విచారణ

2



బీఆర్ఎస్‌కు రాజీనామా

చేయలేదు

స్పీకర్‌కు వివరించిన దానం



## ఉపాధి హామీ చట్టంపై కాంగ్రెస్ యుద్ధభేరి

కొత్త చట్టం వెనక్కి తీసుకునే వరకూ ఉద్యమం: మీనాక్షి నటరాజన్

3

# అట్టహాసంగా సారక్క ఆగమనం

• పూజారుల నృత్యాలు, పూనకాలతో దద్దరిల్లిన మేడారం



మేడారం గద్దెపైకి సారక్క చేరుకుంది. గిరిజన ఆచారాల సాక్షిగా, లక్షలాది భక్తుల కోలాహలం మధ్య సమ్మక్క కూతురు గద్దెను చేరింది. కన్నెపల్లి గ్రామం నుండి డప్పుల దరువులు, పూజారుల నృత్యాలు, భక్తుల పూనకాల మధ్య గద్దెలపై కొలువుదీరింది.



# మహా విషాదం

## కుప్పకూలిన డిప్యూటీ సీఎం విమానం ■ అజిత్‌పవార్‌తో పాటు ఐదుగురు దుర్మరణం

మహారాష్ట్ర రాజకీయాల్లో ఓ షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. డిప్యూటీ సీఎం అజిత్ పవార్(66) ప్రయాణిస్తున్న విమానం క్రాష్ అయింది. ముంబై నుంచి బారామతి వెళ్తున్న ఈ ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ బుధవారం ఉదయం 8:45 గంటల సమయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేస్తున్న సమయంలో కూలిపోగా.. వెంటనే భారీ మంటలు చెలరేగి కాలి బూడిదైంది. ఈ ఘటనలో ఆయనతోపాటు విమానంలో ఉన్న డిప్యూటీ సీఎంతో పాటు మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన యావత్తు దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. అజిత్ పవార్ మరణవార్త తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులు ఢిల్లీ నుంచి బారామతికి బయలు దేరారు. అజిత్ పవార్ మృతిపట్ల ప్రధాని, మోదీ, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఇతర రాష్ట్రాల సీఎంలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.



- ఎమర్జెన్సీ ల్యాండింగ్ సమయంలో ప్రమాదం
- రాయిని ఢీకొట్టి రెండు ముక్కలైన విమానం
- తోక భాగం మినహా విమానం దగ్ధం
- మహారాష్ట్రలో ఘోర విషాదం

4



# ఫిబ్రవరి 3 నుంచి సీఎం ఎన్నికల ప్రచారం

**హైదరాబాద్,జనవరి 28:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చేసింది. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం కోసం ఫిబ్రవరి 3 నుంచి రాష్ట్రంలో పర్యటించనున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన.. నెలాఖరుకు స్వదేశానికి తిరిగి వస్తారు. ఫిబ్రవరి 3న నల్గొండ జిల్లా మిర్యాల గూడ, 4న కరీంనగర్ జిల్లా జగిత్యాల, 5న రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, 6న భూపాలపల్లి, 7న మెదక్, 8న నిజామాబాద్‌లో సీఎం రేవంత్ పర్యటిస్తారు. కాగా, మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా తొలి రోజు 890 మంది అభ్యర్థుల నుంచి 902 నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో 382 మంది కాంగ్రెస్ అభ్యర్థులు, 258 మంది బీఆర్ఎస్ అభ్యర్థులు, 169 మంది భాజపా అభ్యర్థులు ఉన్నారు.

# కేబుల్ ఛానెల్స్, చిన్న పత్రికలకు న్యాయం చేయాలి

**ఐఅండ్‌పీఆర్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చిన టీయూడబ్ల్యూజే నేతలు**

**హైదరాబాద్, జనవరి 28:** జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు జారీ చేసే జీ.ఓ252లో ఇంకా పలు సవరణలు చేయాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (ఎఉ143) సంఘం నాయకులు ఐ అండ్ పీఆర్ కమిషనర్ సి.హెచ్.ప్రియాంకను కలిసి వినతిపత్రం సమర్పించారు. సచివాలయంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో సూచించిన అంశాలను సవరించిన జీ.ఓ109లో చేర్చాలని వారు కోరారు. గతంలో జీఓ 239 ప్రకారం కేబుల్ ఛానెల్స్‌కు హైదరాబాద్ ఐ అండ్ పీఆర్ కేంద్రంలో 12 అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చారని, అవి కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కేబుల్ ఛానల్ ప్రసారాలు జరిగే ప్రతి జిల్లా కేంద్రంలో 4 అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యతరహా, చిన్న పత్రికలకు నియోజకవర్గానికి ఒక అక్రెడిటేషన్ కార్డు ఇవ్వాలన్న నిబంధనను కొత్త జీ.ఓలో తొలగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, దాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డు జారీకి 15 ఏళ్ల అనుభవం నిబంధనను 10 ఏళ్లకు తగ్గించాలని కూడా వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, టీయూడబ్ల్యూజే కోశాధికారి పి.యోగానంద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి యార నవీన్ కుమార్, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్, కోశాధికారి బాపు రావులు పాల్గొన్నారు.

# రోడ్డుపై స్కూల్ బస్ బోల్తా,



**చేవెళ్ల, జనవరి 28 :** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని మృగావాన్ని పార్కు వద్ద హైదరాబాద్- బీజాపూర్ రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. బండ్లగూడ జాగర్ లోని హైదరాబాద్ ఎక్సెన్స్ స్కూల్ కు చెందిన బస్సు విద్యార్థులతో హైదరాబాద్ నుంచి మొయినాబాద్ కు బయలుదేరింది . హైదరాబాద్- బీజాపూర్ రహదారిపై వెళ్తుండగా మృగావాన్ని పార్కు వద్ద ముందున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో బస్సు ప్రమాదానికి గురైంది ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు వారిని ఆసుపత్రికి తరలించారు.

# నేడు మేడారంకు కేంద్ర గిరిజన శాఖ మంత్రి జుయల్ ఓరం

**రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి అడ్లూరి విజ్ఞప్తి మేరకు రాక**



**హైదరాబాద్, జనవరి 28:** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి గాంచిన సమ్మక్క సారలక్క జాతరకు గురువారం కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరం గారు పాల్గొని పూజలు నిర్వహించనున్నారు. ఇటీవల హైదరాబాద్ లోని కన్హా శాంతి వనంలో జరిగిన గిరిజన గ్రామీణ వైద్య సహకారుల సదస్సులో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కేంద్ర మంత్రిని కలిసి సమ్మక్క సారలక్క జాతర ఆహ్వాన పత్రికను రాష్ట్ర ప్రభుత్వం తరపున అందించారు. అలాగే, ఈ జాతర ప్రత్యేకతను వివరించడంతో పాటు జాతర ప్రాశస్త్యతను చెప్పడంతో కేంద్ర మంత్రి తప్పకుండ జాతరలో పాల్గొంటానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే కేంద్ర మంత్రి ఈ జాతరకు హాజరవుతున్నారు. హెలిప్యాడ్ ద్వారా ఉదయం మేడారం కు కేంద్ర మంత్రి చేరుకుంటారు. అక్కడ మంత్రి అడ్లూరి, కేంద్ర మంత్రిని ఆహ్వానం పలికి కేంద్ర మంత్రిని వెంటబెట్టుకొని సమ్మక్క సారలక్క దేవస్థానాన్ని చేరుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లోనూ సత్తా చాటుతాం

మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ప్రజాదరణ ఉన్న, గెలిచే సామర్థ్యం కలిగిన అభ్యర్థులకే టికెట్లు కేటాయించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నమ్మిన వారు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగల నాయకులపై దృష్టి సారించాలని అన్నారు. ఇప్పటికే అమలు చేస్తున్న 'ఆరు గ్యారెంటీలు'తో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి మద్దతు కూడగట్టే నాయకుల ఎంపిక కీలకమని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన నేపథ్యంలో అభ్యర్థుల ఖరారు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌లో కాంగ్రెస్ అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఫిబ్రవరి 13న వెలువడే ఫలితాల్లో పార్టీ జెండా ఎగిరేలా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, మున్సిపల్ బాధ్యులు సమష్టిగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.



ప్రభుత్వ విజయాలను ఆయుధంగా మలచుకుని మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులను ఆయన ఉత్సాహపరిచారు. నగరాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తామని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుల అంశంపై పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ నిర్ణయం తీసుకుంటారని భట్టి విక్రమార్క చెప్పారు. తమ క్యాబినెట్ ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తోందని, రాష్ట్ర భవిష్యత్తే తమ అందరి లక్ష్యమని స్పష్టం చేశారు. 'ప్యూర్, క్యూర్, రేర్' సమగ్ర విధానంతో తెలంగాణ అభివృద్ధి కోసం 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. ప్రజాభవన్‌లో మంత్రుల భేటీపై వస్తున్న అసత్య కథనాలపై ఆయన స్పందిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలో లేని సమయంలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై మంత్రులు తనను కలవడంలో తప్పేమీ లేదన్నారు. మంత్రులు తెలియజేసిన సమస్యలను ముఖ్యమంత్రికి వివరించినట్లు చెప్పారు. డిప్యూటీ సీఎంను మంత్రులు కలవకపోతే ఇంకెవరిని కలుస్తారని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సమిష్టిగా పనిచేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# దానం నాగేందర్‌కు బిగ్ షాక్

**ఫిరాయింపు కేసులో స్పీకర్ నోటీసులు**

**పిటిషన్ వేసిన ఎమ్మెల్యేకు కూడా..**

**హైదరాబాద్,జనవరి28:** తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల అంశంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో.. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వేగం పెంచారు. ఇందుకు సంబంధించి తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం ఈ విషయం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ నెల 30వ తేదీన ఉదయం స్పీకర్ కార్యాలయంలో హాజరు కావాలని దానం నాగేందర్‌ను ఆదేశించారు. అదేవిధంగా ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి కూడా నోటీసులు అందాయి. ఇందులో భాగంగా ఉదయం 10:30 గంటలకు బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరగనుండగా.. మధ్యాహ్నం 12:00 గంటలకు బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరగనుంది. ఎమ్మెల్యేల అనర్హత అంశంలో జాప్యం జరుగుతోందని భావించిన సుప్రీంకోర్టు ఈ నెల 19న స్పీకర్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. చర్యలు తీసుకోకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించిన నేపథ్యంలో, స్పీకర్ పెండింగ్‌లో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలుదానం నాగేందర్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇప్పటికే అరికపూడి గాంధీ సహా మరో ఏడుగురికి 'క్లీన్ చిట్' లభించిన సంగతి తెలిసిందే. అయితే మిగిలిన ఎమ్మెల్యేలతో పోలిస్తే దానం నాగేందర్ కేసు భిన్నమైనది. ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బి-ఫామ్‌పై ఎంపీగా పోటీ చేశారు. ఇది స్పష్టమైన ఫిరాయింపు కిందకు వస్తుందని.. అందుకే ఆయనపై అనర్హత వేటు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం. ఒకవేళ స్పీకర్ అనర్హత వేటు వేస్తే, దానం తన ఎమ్మెల్యే పదవిని కోల్పోతారు. మరోవైపు స్పీకర్ నిర్ణయం తీసుకోకముందే.. దానం నాగేందర్ తన పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళ్తారనే ప్రచారం కూడా గట్టిగా సాగుతోంది. మొత్తానికి 30వ తేదీన జరిగే విచారణ తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు దారితీసేలా కనిపిస్తోంది.

## బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదు

**హైదరాబాద్, జనవరి 28 :** తెలంగాణలో బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యే వ్యవహారంలో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై, ఆయన స్పీకర్ కు వినతిపత్రం అందజేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలను దానం నాగేందర్ ఘాటుగా ఖండిస్తూ, ఆ పిటిషన్‌ను కొట్టి వేయాలని స్పీకర్‌ను కోరారు. అఫిడవిట్‌లో దానం నాగేందర్ తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని, అలాగే పార్టీ తనను సస్పెండ్ చేసినట్లు సమాచారమూ అధికారికంగా తనకు అందలేదని స్పష్టం చేశారు. మార్చి 2024లో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి హాజరైన విషయాన్ని అంగీకరించినప్పటికీ, అది పూర్తిగా వ్యక్తిగత హోదాలో జరిగినదేనని చెప్పారు. ఒక పార్టీ సమావేశానికి వ్యక్తిగతంగా హాజరవడమే ఫిరాయింపుగా పరిగణించడాన్ని ఆయన తప్పుబట్టారు. మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావించడం అనుచితమని, ఆ నిర్ధారణకు చట్టపరమైన ఆధారాలు లేవని చెప్పారు. అనర్హత పిటిషన్ రాజకీయ ప్రయోజనాల కోసం దాఖలు చేయబడిందని వాదించిన దానం నాగేందర్, పిటిషన్‌లో బలం లేదని, అందువల్ల దానిని కొట్టి వేయాలని స్పీకర్ కోర్టును కోరుతూ తన అఫిడవిట్‌ను ముగించారు.

# బోధనలో నాణ్యత పెరగాలి

**విద్యాశాఖపై ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష**

హైదరాబాద్, జనవరి 28: ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థలలో బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాల స్థాయి వరకు ప్రతి విద్యా సంస్థలోను మెరుగైన బోధన సాగాలని, విద్యా బోధనలలో నాణ్యత ప్రమాణాలు పెంచే దిశగా కార్యాచరణ రూపొందించుకోవాలని సీఎస్ ఆదేశించారు. గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విద్యాశాఖపై సంబంధిత ఉన్నతాధికారులతో బుధవారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య, డిజిటల్ విద్య, ఇంటర్మీడియట్, డిగ్రీ కాలేజీల్లో పనితీరు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం, తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఉన్నత విద్యా సంస్థలు, కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో బోధన చేసి రిటైర్డ్ అయిన మంచి అనుభవం కలిగిన ప్రొఫెసర్స్, లెక్చరర్స్, టీచర్స్‌తో



విద్యార్థులకు తరుచుగా ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు బోధన చేయిస్తే విద్యార్థులలో సృజనాత్మకత, మోటీవేషన్, మంచి ఆలోచనలు పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. తద్వారా విద్యార్థుల భవిష్యత్ కు సంబంధించి ప్రణాళికలు ఏర్పరచుకొనే అవకాశం ఉంటుందని అన్నారు. అదే విధంగా కేజిబివి, వివిధ సంక్షేమ వసతి గృహాలలో ఒక వసతి గృహాన్ని ఎంపిక చేసుకొని అందులో సోలార్ మోడల్ తరహా కిచెన్, స్టోరేజ్ రూమ్స్, మౌలిక వసతులు, త్రాగునీరు, టాయిలెట్స్, విద్యుత్, ఇంటర్నెట్ అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి దానిని ఒక మోడల్ హాస్టల్ గా రూపొందించాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. దానిని ఆదర్శంగా తీసుకోని భవిష్యత్‌లో మిగితా వసతి గృహాలలో కూడా ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. కళాశాలల స్థాయిలో కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించాలని, ః.ఇట కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం క్రింద ప్రభుత్వ పాఠశాలలో బోధన చేయించాలని, విద్యార్థులలో ఆసక్తి, నైపుణ్యాలు పెంచే విధంగా అనుభవం కలిగిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, మార్గదర్శకులతో తరగతులు నిర్వహిస్తే విద్యార్థులకు మంచి ప్రయోజనం కలుగుతుందని అన్నారు. సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటి ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా, పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సమీకృత రిజిస్ట్రార్ కార్యాలయాలు

**పటాన్‌చెరులో మంత్రుల శంకుస్థాపన**

**సంగారెడ్డి, జనవరి 28:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం కర్దనూరులో నూతనంగా నిర్మించనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ పనులకు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. భూమి సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధరణి వ్యవస్థను మార్చి.. భూ భారతి వ్యవస్థను తీసుకొచ్చామని.. సామాన్య ప్రజలకు ఒక చుట్టం లాంటిదిగా భూ భారతిని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగంలో కోట్లాది రూపాయలు ఫీజులు చెల్లించే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని వివరించారు. అంతేకాకుండా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో 11 ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. పటాన్‌చెరు ప్రాంతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం 3 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వానికి అదనపు భారం పడకుండా సీఎస్ఆర్ ఫండ్ ద్వారా ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు చెప్పారు. నిర్మాణ పనులను రాజ్ పుష్ప సంస్థకు అప్పగించినట్లు వివరించారు. రాబోయే 6 నెలల్లో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో అన్ని సౌకర్యాలతో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు మంత్రి



తెలిపారు. పెద్దపల్లిలో రాజ్‌పుష్ప సంస్థ.. భవన నిర్మాణాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ భవనాల మెయింటెనెన్స్‌ను ఐదేళ్ల పాటు సంబంధిత సంస్థలకే అప్పగించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 ఏజెన్సీలను ఎంపిక చేసి ఈ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్తున్నట్లు వెల్లడించారు. ఇక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ÷వ్ స్టార్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. మ్యారేజ్ హాల్స్, చంటి పిల్లల కోసం ప్రత్యేక సౌకర్యాలు ఉండనున్నాయని చెప్పారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు లేకుండా భూధార్ వ్యవస్థను తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. ఒకే ఎ÷-లాట్‌ఫాం ద్వారా భూమి సరిహద్దులు, వివరాలు అందుబాటులో ఉండనున్నాయని అన్నారు. నిషేధిత భూముల విషయంలో అనేక వివాదాలు ఉన్నాయని, ఈ సమస్యల పరిష్కారానికి రెండు నెలల్లో కొత్త యాప్‌ను తీసుకువస్తున్నట్లు తెలిపారు. భూధార్ కార్డు.. భూమి సంబంధిత అన్ని సమస్యలకు సంపూర్ణ పరిష్కారం అని, దీని ద్వారా భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఉండవని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు నిర్మలా జగ్గారెడ్డి, ఫహీంలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టంపై కాంగ్రెస్ యుద్ధభేరి

- కొత్త చట్టం వెనక్కి తీసుకునే వరకూ ఉద్యమం
- కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం




**మానకొండూర్, జనవరి 28 :** పంజాబ్‌లో రైతు వ్యతిరేక చట్టాలను ఎలా అయితే కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొందో, అదే తరహాలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన కొత్త చట్టాన్ని వెనక్కి తీసుకునే వరకూ ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ముంజంపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికుల హక్కులను కాలరాస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అధినేతల మార్గదర్శకత్వంలో దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ ఉద్యమంలో కార్మికులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నేతృత్వంలో ఉపాధి హామీ చట్టం తీసుకువచ్చి కార్మికులకు హక్కులు కల్పించామని ఆమె గుర్తు చేశారు. రైతులకు కనీస మద్దతు ధర మాదిరిగానే ఉపాధి కార్మికులకు పనిదినాలు కల్పించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ పేరు మార్చడమే కాకుండా ఉపాధి హామీ పథక నిధులపై కేంద్ర ప్రభుత్వం కోతలు పెడుతోందని విమర్శించారు. రూ.100 ఖర్చు చేస్తే కేంద్రం రూ.60 మాత్రమే ఇస్తూ, మిగతా రూ.40 రాష్ట్రాలే భరించాలని ఆంక్షలు విధించడం అన్యాయమని అన్నారు. మోడీ ప్రభుత్వం ధనవంతులను మరింత ధనవంతులుగా చేస్తోందని, అంబానీ, అదానీల కోసం పనిచేస్తోందని విమర్శించారు. బీదలను మరింత బీదలుగా మార్చే విధానాలు అవలంబిస్తోందన్నారు. ఉపాధి హామీ పథకంలో మార్పులు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయడం విజయమని గుర్తు చేశారు. గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడిచేలా కేంద్రం వ్యవహరిస్తోందని, పల్లెల్లో పనులు లేకుండా చేస్తే ఎలా అని ప్రశ్నించారు. క్రూడాయిల్ ధరలు భారీగా తగ్గినా పెట్రోల్ ధరలు తగ్గించకుండా ప్రజలపై భారం మోపుతూ కేంద్రం రూ.90 లక్షల కోట్లకు పైగా లాభాలు ఆర్జించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీదల ప్రభుత్వమని, బీజేపీ డబ్బున్నవారి ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ కూడా బీజేపీకి తోడైందని, ఇద్దరూ తోడు దొంగలని విమర్శించారు. మోడీకి మంచి బుద్ధి ఇవ్వాలని సమ్మక్కఉసారలమ్మ వద్ద మొక్కులు చెల్లించాలని ప్రజలను కోరారు. టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు హనుమంతరావు, ఓబీసీ రాష్ట్ర చైర్మన్ జూలూరి ధనలక్ష్మి, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్ తదితర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతర ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి

- ఆదివాసలు అస్తిత్వం దెబ్బతినకుండా మార్పులు
- భక్తులకు వసతి కల్పించేలా జాతరకు భారీగా ఏర్పాట్లు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**ములుగు, జనవరి 28:** సమక్క సారలమ్మ జాతర ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క) అన్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర వద్ద ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ లో బుధవారం జాతరను ప్రెస్ కవరేజ్ చేస్తున్న వివిధ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులకు, మీడియా ప్రతినిధులకు మంత్రి సీతక్క టీ షర్ట్ లను పంపిణీ చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, కోట్లాది మంది భక్తుల కొంగు బంగారంమైన సమక్క సారలమ్మ జాతర కు భక్తుల రాక విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. ములుగు జిల్లాలో నిర్వహించే జాతరలో ప్రస్తుత సంవత్సరం అనేక మార్పులు చేసినప్పటికీ ఎక్కడ కూడా ఆదివాసుల అస్థిత్వం, ఆత్మగౌరవం, పూజ విధానం లో మార్పు లేకుండా ఏర్పాట్లు చేశామని అన్నారు. జాతరకు పెద్ద ఎత్తున వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా రోడ్డు విస్తరణ, మెరుగైన పారిశుధ్య చర్యలు, విద్యుత్ దీపాలంకరణ, క్యూ లైన్ సౌకర్యాలు మెరుగయ్యాయని అన్నారు. సమ్మక్క సారలమ్మ జాతర తీసుకొచ్చే విధానం పూజ వ్యవహారాలలో ఎటువంటి మార్పు రాలేదని అన్నారు. 4 రోజులు జరిగే సమక్క సారలమ్మ జాతరకు ప్రస్తుత సంవత్సరం 40 రోజుల సరిపడా ఏర్పాట్లు చేశామని అన్నారు. భక్తులకు అవసరమైన టాయిలెట్స్, త్రాగు నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణకు అదనపు కార్మికులను ముందుగానే జాతర స్థలం వద్ద సిద్ధం చేశామని అన్నారు. సమక్క సారలమ్మ జాతరకు ఇప్పటి వరకు 20 లక్షల భక్తులు వచ్చారని అంచనా వేశామని అన్నారు. మక్క సారలమ్మ జాతర కవర్ చేసే అదృష్టం పాత్రికేయులకు కలిగిందని, జాతర యొక్క ఔన్నత్యం గొప్పతనాన్ని బయట ప్రపంచానికి మీడియా చాటి చెప్పాలని మంత్రి తెలిపారు. రాబోయే సమ్మక్క సారలమ్మ జాతర సమయానికి మీడియా కు సైతం పెద్ద హాల్, మెరుగైన వసతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు డిఎస్ జగన్, ఉప సంచాలకులు వెంకటేశ్వర్లు, వెంకట సురేష్ సంబంధించిన పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# వనదేవతల చెంతకు మంత్రి పొంగులేటి





**మేడారం, జనవరి 29:** రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం రాత్రి కుటుంబ సమేతంగా మేడారం సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. జాతర ప్రారంభమైన తొలిరోజే ఆయన వనదేవతల చెంతకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ఆలయ పూజారులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రత్యేకించి తాగునీరు, పారిశుధ్యం, రవాణా సౌకర్యాలపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. జాతర విజయవంతం కావడానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# అదుపుతప్పి మెట్రో పిల్లర్‌ను ఢీకొన్న కారు

## ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి

**హైదరాబాద్, జనవరి 28:** హైదరాబాద్ శివారులోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రయాణిస్తున్న ఓ వాహనం అదుపుతప్పి మెట్రో పిల్లర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ముగ్గురికి గాయాలయ్యారు. ఆ ముగ్గురు విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఈ ఘటనపై స్థానికులు మేడిపల్లి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యార్థుల కారు అత్యంత వేగంతో ప్రయాణిస్తోందని, డ్రైవర్ స్పీడ్‌ను కంట్రోల్ చేయలేకపోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని తెలిపారు. దీంతో కారు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న మెట్రో పిల్లర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. వీరంతా ఒకే ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాద సమయంలో డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడా, లేదా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. విద్యార్థుల మృతితో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే వాహనదారులు, ముఖ్యంగా యువత సరైన జాగ్రత్తలు పాటించాలని మేడిపల్లి పోలీసులు సూచించారు. నగర శివార్లలో రోడ్లు ఖాళీగా ఉన్నాయని వేగం పెంచి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని.. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్లు వాడవద్దని సూచించారు.





# మున్సిపల్ ఎన్నికల్లో 'జాగృతి' అభ్యర్థులు

## ఫార్వర్డ్ బ్లాక్ 'సింహం' గుర్తుపై పోటీ

**హైదరాబాద్, జనవరి 28 :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింహం గుర్తుపై తెలంగాణ జాగృతి మద్దతుతో ఔత్సాహిక అభ్యర్థులు పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ జావెద్ లతీఫ్ వెల్లడించారు. ఈ నిర్ణయాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో అధికారికంగా ప్రకటించారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ జాగృతి, ఏఐఎఫ్‌బీ నేతల మధ్య కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికలతో పాటు భవిష్యత్తులోనూ రెండు సంస్థలు కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ఏఐఎఫ్‌బీ రాష్ట్ర చైర్మన్ జావెద్ లతీఫ్, కన్వీనర్ జోజిరెడ్డి, ఉపాధ్యక్షుడు కె.బుచ్చిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు ఆర్వీఆర్ ప్రసాద్, తేజ్ దీప్ రెడ్డి, కొండ దయానంద్, ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీ కె.నరేందర్ పాల్గొన్నారు. అలాగే నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బీరన్న, నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, ఐవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిత్య, జనరల్ సెక్రటరీ కృష్ణమూర్తి సహా పలువురు ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా కలిసి పనిచేస్తామని, ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను అందించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని నేతలు తెలిపారు.

# పేదల నోరు కొడుతున్న ప్రధాని మోడీ

## ఉపాధిని మార్చడంపై నిరసనలో మహేశ్ కుమార్

**మెదక్, జనవరి28:** ప్రధాని మోడీ పేదవాళ్ళ నోటికాడి ముద్దను లాక్కోవాలని చూస్తున్నాడని టీ పీసీసీ చీఫ్ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. జాతీయ ఉపాధి హామీ చట్టం పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని ఖండిస్తూ మెదక్ జిల్లాలో నరేగా బచావో, బీజేపీ హటావో నినాదంతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. మోడీ గరీబోళ్లను కష్ట దుతున్నారని అన్నారు. గరిబోళ్ళకోసం సోనియా గాంధీ అనంతపురం పర్యటనలో ఉన్నపుడు పనికి ఆహార పథకం తీసుకొచ్చారని చెప్పారు. అనంతరపురంలో అన్ని ఇళ్లకు తాళాలు ఉంటే...సోనియా గాంధీ మన్మోహన్ సింగ్ కు చెప్పి పనికి ఆహార పథకాన్ని మొదలు పెట్టారని చెప్పారు. గ్రామ జనం పటిష్టంగా ఉంటే గ్రామాలు సౌభాగ్యంగా ఉంటాయన్నారు. కానీ మోడీ, అదానీ, అంబానీల కోసం పనికి ఆహర పథకాన్ని తొలగించాలని చూస్తున్నారని విమర్శించారు. పనికి ఆహర పథకం కోసం సోనియా గాంధి, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పార్లమెంట్ లో పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఫిబ్రవరి నాటికి గ్రామీణ ఉపాధీ హామీ పథకం తీసుకొచ్చి 20 ఏళ్లు పూర్తవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ గరిబోళ్ల పార్టీ, ఎస్సీ,ఎస్టీ ,బీసీల వెనుక కాంగ్రెస్ పార్టీ ఉంటుంది. మోడీకి వ్యతిరేకంగా గ్రామాల్లో మహిళలు ముందుకు సాగాలని మహేష్ కుమర్ పిలుపునిచ్చారు.

# తెలంగాణలో మరో భారీ స్కామ్!

## హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు

## హరీష్‌రావు ఆరోపణలపై జూపల్లి కౌంటర్



**హైదరాబాద్, జనవరి 28:** ఎక్సైజ్ శాఖలో భారీ అవినీతి జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ కీలక నేత హరీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. మైక్రో బ్రూవరీస్ లైసెన్సుల జారీలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని.. వీటిని దక్కించుకునేందుకు 110 దరఖాస్తులు వస్తే, వాటిలో కేవలం 25 మందికి మాత్రమే కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారని విమర్శించారు. ఇందులో ఓ ముఖ్య నేత కోటా కింద 21, సంబంధిత మంత్రి కోటా కింద 4 టెండర్లను ఖరారు చేశారని సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన హరీష్.. రాష్ట్ర ప్రభుత్వం పనితీరుపై మండిపడ్డారు. పారదర్శకంగా లాటరీ పద్ధతిలో లైసెన్సులు కేటాయించకుండా, నచ్చిన వారికి కట్టబెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైందని అన్నారు. సింగరేణిలో జరిగిన అక్రమాలపై ఇంకా మాట్లాడాల్సి ఉందని, ఈరోజు మాత్రం ఎక్సైజ్ శాఖలో జరుగుతున్న దోపిడీని బయటపెడుతున్నానని స్పష్టం చేశారు.

## ఆ సిస్టమ్ తెచ్చిందే బీఆర్‌ఎస్ ప్రభుత్వం

హరీష్ రావు ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కౌంటర్ ఇచ్చారు. అసలు మైక్రో బ్రువరిస్ సిస్టమ్ తెచ్చిందే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అని అన్నారు. గతంలో అసలు లాటరీ విధానం లేకుండానే మైక్రో బ్రువరీస్ కు అనుమతులు మంజూరు చేసిన ఘనత గులాబీ పార్టీకే దక్కుంతుదని ఎద్దేవా చేసారు. 50 దరఖాస్తులు వస్తే కేవలం 20 మందికి మాత్రమే మొత్తం కట్టబెట్టారని.. అప్పుడు ఎందుకు నోరుమెదపలేదని హరీష్ రావును నిలదీశారు. సింగూరు జలాల విషయంలో అబద్దపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే సింగూరు జలాలను మైక్రో బ్రేవరికి సరఫరా చేశారని.. అదేపని తాము ఇప్పుడు చేస్తే.. ప్రభుత్వాన్ని అప్రతిష్ట పలు చేసే విధంగా మాట్లాడుతున్నారు ఆగ్రహం వ్యక్తం చేసారు. కాగా రాష్ట్రంలో మైక్రో బ్రువరీస్ కు లక్కీ డ్రా తీయకుండానే వాటి లెసెన్సులను మంత్రి ఆయన అనుచరునికి కేటాయించారని బుధవారం హరీష్ రావు ఆరోపించారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | గురువారం 29 జనవరి 2026



సంపాదకీయం

# బహుళ ప్రయోజనాల ఒప్పందం!

ట్రంప్ టారిఫ్‌లతో ప్రపంచం అల్లకల్లోలం అవుతున్నది. అంతేగాకుండా సామ్రాజ్య విస్తరణ కాంక్ష పెరుగుతోంది. సొంతదేశం అమెరికాలోనే ట్రంప్ పట్ల తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఓ వైపు టారిఫ్‌లు మరోవైపు వీసాల కట్టడితో భారత్ లక్ష్యంగా ట్రంప్ పరోక్ష యుద్ధం మొదలు పెట్టాడు. ఒకవైపు ట్రంప్ టారిఫ్‌ల దూకుడు, మరోవైపు చైనా ఆధిపత్యం, కీలక ఉత్పత్తుల సరఫరాలపై నియంత్రణలతో ప్రపంచ వాణిజ్యంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఈయూ-భారత్ ఒప్పందంతో అటు అమెరికా దూకుడుకు అడ్డుకట్ట వేయడం, ఇటు చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టడం సాధ్యమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య వాణిజ్య ఒప్పందంపై 2007లో చర్చలు మొదలయ్యాయి. వివిధ కారణాలతో మధ్యలో నిలిచిపోయాయి. అంటే గత యూపిఏ హయాంలోనే ఈ ప్రక్రియ ప్రారంభం అయ్యిందని చెప్పుకోవాలి. తిరిగి 2022లో చర్చలు ప్రారంభమయ్యాయి. మొత్తంగా రెండు దశాబ్దాల అనంతరం ఒప్పందం కుదిరింది. గ్రీన్‌లాండ్ అంశంలో ట్రంప్ వ్యవహారశైలి, అమెరికా లేకుంటే యూర్‌పను ఎవరూ పట్టించుకోబోరన్న వ్యాఖ్యలు, టారిఫ్ విధిస్తానంటూ బెదిరించడం తో.. ఆగ్రహంతో ఉన్న ఈయూ భారత్‌తో ఒప్పందంపై చర్చలను వేగవంతం చేసింది. ఈక్రమంలో భారత్ ఆచితూచి మసలు కుంటోంది. ప్రపంచ దేశాలతో సయోధ్యకు యత్నిస్తోంది. కొందు చెప్పినట్లుగా అమెరికాను ఎదరించడం ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కాదు. ఎందుకంటే మన వాణిజ్యానికి తోడు, మన దేశీయులు లక్షల్లో అక్కడ ఉన్నారు. వారి ప్రయోజనాలు కూడా ముఖ్యం. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు మోడీని విమర్శించడమే లక్ష్యంగా మన విదేశాంగ విధానంపై దుమ్మె పోస్తున్నారు. కానీ ఇది సరైన విషయం కాదు. భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎడారిలో ఒయాసిస్సు లాంటిది. వాణిజ్యం కోసం అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం, ఇతర మార్కెట్లను అందిపుచ్చు కోవడం దిశగా భారత్ ముందడుగు వేస్తున్న క్రమంలో కొత్త వాణిజ్య ఒప్పందం ఓ పెద్ద ముందడుగా భావించాలి. యూరప్ దేశాలకు ఎగుమతి చేసే చాలా రకాల ఉత్పత్తులపై సుంకాలు పూర్తిగా తొలగి పోనున్నాయి. దీనితో భారత వ్యాపారులు, ఎగుమతిదారులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలగనుంది. యూరప్ దేశాల నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే కార్లు, వైన్స్, అత్యవసర ఔషధాలు వంటి వాటి ధరలు కూడా తగ్గనున్నాయి. యూరోపియన్ యూనియన్, భారత్ మధ్య భారీ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దీన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' గా అభివర్ణించవచ్చు. ఇటు భారత్‌లోని 140 కోట్ల మంది, ఈయూలోని కోట్లాది మంది ప్రజలకు అద్భుతమైన అవకాశాలు లభిస్తాయి. భారత్, ఈయూ ఉమ్మడి జీడీపీ ప్రపంచ జీడీపీలో 25శాతం. ఇది ప్రపంచ వాణిజ్యంలో మూడో వంతుతో సమానం అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్‌లో భాగమైన 27 దేశాల్లో ఈ ఒప్పందంపై చట్టాలు చేసిన త ర్వాత పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది. ఇందుకోసం ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. కాగా, భారత్-ఈయూ సదస్సులో భాగంగా యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియా కోస్టాలతో ప్రధాని మోదీ భేటీ అయి.. వాణిజ్యంతోపాటు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులు, ప్రస్తుత పరిణామాలపై చర్చించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం తోపాటు మొత్తం 13 అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వచ్చే ఐదేళ్లకు సంబంధించిన ఉమ్మడి వ్యూహాత్మక ఎజెండాను ఆమోదించారు. నిజానికి ఇదో పెద్ద ముందడుగుగా భావించాలి. భారత్ వేస్తున్న అడుగులను ట్రంప్ కూడా గమనిస్తున్నారు. బెదరింపు ధోరణులతో భారత్‌ను కట్టడి చేయడం సాధ్యంకాదని ఈ ఒప్పందంతో అర్థం కానుంది. ముఖ్యంగా భారత్ వస్తువులకు మార్కెట్ అవసరం. అది ఇప్పుడు కొంత తీరనుంది. 2030 నాటికి భారత్, ఈయూ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, డిజటల్ కనెక్టివిటీ బలోపేతం చేసేందుకు.. ఉమ్మడి సమగ్ర, వ్యూహాత్మక ఎజెండాను అనుసరించాలని నిర్ణయించారు. ఇది యూరప్ దేశాల్లో భారత యువత ఉద్యోగాలు, విద్య, పరిశోధన రంగాల్లో మంచి అవకాశాలు పొందేందుకు కూడా తోడ్పడనుందని విశ్లేషణలు వస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక భాగస్వామ్య ఒప్పందం పొడిగింపు, గ్రీన్ హైడ్రోజన్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు, రహస్య సమాచారం పరస్పర మార్పిడి ఒప్పందంపై చర్చలు చేపట్టడంపైనా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా కార్ల దిగుమతిపై భారత్ యూరోపియన్ యూనియన్‌పై ఆధారపడుతోంది. యూరప్ నుంచి దిగుమతి అయ్యే కార్లపై ప్రస్తుతం 125శాతం వరకు సుంకాలు ఉన్నాయి. తాజా ఒప్పందం ప్రకారం కార్లపై సుంకాలు 40శాతానికి తగ్గుతాయి. తర్వాత దశలవారీగా 10శాతానికి తగ్గిస్తారు. దీనితో యూర్‌పకు చెందిన బీఎండబ్ల్యూ, ఆడి, మెర్సిడెజ్, లాంబోర్గిని, పోర్షే వంటి కార్ల ధరలు భారీగా తగ్గుతాయి. మరోవైపు భారత్ నుంచి యూరప్ దేశాలకు ఎగుమతి చేసే కార్లపైనా అక్కడి సుంకాలను 10శాతానికి తగ్గిస్తారు. ఇది భారత కంపెనీలకు ప్రయోజనం కలిగిస్తుంది. ఇలా పరస్పరం సుంకాల మినహాయింపు వల్ల మన ఉత్పత్తుకు కూడా ఎగుమతి మార్కెట్ లభిస్తుంది. ఇకపోతే యూరప్ దేశాల నుంచి భారత్‌కు వచ్చే వైన్, విస్కీ, వోడ్కా, బీర్ వంటివాటిపై 150శాతం వరకు దిగుమతి సుంకాలు ఉన్నాయి. క్యాన్సర్ ఔషధాలు, బరువు తగ్గించే మందులు సహా కీలక ఫార్మా ఉత్పత్తుల ధరలు 11 శాతం వరకు, వైద్య పరికరాలు ధరలు 25శాతం వరకు తగ్గుతాయి. మందుల తయారీకి వాడే ముడి పదార్థాల ధరలు తగ్గడం వల్ల దేశంలో ఫార్మా కంపెనీలకు ప్రయోజనం కలగనుంది. విమానాలు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై భారత సుంకాలు తగ్గుతాయి. దీనితో యూరప్ నుంచి వచ్చే సంబంధిత ఉత్పత్తుల ధరలు తగ్గుతాయి. ఇక భారత్ నుంచి యూరప్ దేశాలకు వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, ఆభరణాల ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయి. బిస్కట్లు, పాస్తా, చాకోలెట్లు, పండ్ల రసాలు వంటి ప్రాసెస్డ్ ఉత్పత్తులు, ఆలివ్ ఆయిల్, ఇతర నూనెలపై సుంకాలు ఎత్తివేయడం వల్ల ధరలు తగ్గే అవకాశం ఉంటుంది. నిజానికి ఇదో పెద్ద విజయంగా, కీలక పరిణామంగా చూడాలి. ప్రపంచంతో పోటీపడి మన ఉత్పత్తులను అమ్ముకోవడానికి అవకాశం ఏర్పడింది. అమెరికా విధిస్తున్న టారిఫ్‌ల బెడద నుంచి ఉపశమనానికి ఈ ఒప్పందం కీలకం కానుందనడంలో సందేహం లేదు.

# వికసిత్ భారత్ వైపు దేశం పయనిస్తోంది

- పదేళ్లలో పేదల కోసం 4కోట్ల ఇళ్లు
- జల్ జీవన్ మిషన్‌తో గ్రామాలకు తాగునీరు
- వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవ
- ఆయుష్మాన్ భారత్‌తో కోట్లమందికి వైద్యం
- వరిధాన్యం ఉత్పత్తిలో ప్రపంచంలో నెం.1
- అక్వా, పాల ఉత్పత్తుల్లో భారత్ ముందంజ
- 11 ఏళ్లలో ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి
- జీఎస్టీ తగ్గింపుతో పెరిగిన కొనుగోలు శక్తి
- పవర్ టెక్నాలజీ హబ్‌గా మారుతున్న భారత్
- గ్రీన్ ఎనర్జీ రంగంలో పవర్ హౌస్‌గా భారత్
- పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం



**న్యూఢిల్లీ, జనవరి 28:** దేశం వికసిత్ భారత్ వైపు పయనిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత పదేళ్లలో పేదల కోసం 4కోట్ల ఇళ్లు కట్టించామని, జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. 'పదేళ్లలో 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. సామాజిక న్యాయం ప్రాతిపదికన కేంద్రం పనిచేస్తోందన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలి రోజైన బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభల్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ.. వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు విస్తరించాం. ప్రతి పౌరుడికి జీవిత బీమా కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. ఆయుష్మాన్ భారత్‌తో కోట్లమందికి వైద్యసేవలందిస్తున్నాం. వరి ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ నెం1 స్థానంలో నిలిచింది. అక్వా, పాల ఉత్పత్తుల్లో భారత్ ముందంజలో ఉందని రాష్ట్రపతి వెల్లడించారు. దేశంలో స్పేస్ టూరిజం అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయని రాష్ట్రపతి అన్నారు. భవిష్యత్‌లో అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని, జమ్మూకశ్మీర్‌లో అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మించామని గుర్తు చేశారు. గత 11 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందిందని రాష్ట్రపతి చెప్పారు. అవినీతి కట్టడితో ప్రభుత్వ ప్రజాధనాన్ని సద్వినియోగం చేస్తోంది. జిఎస్‌టి స్లాబ్‌ల తగ్గింపుతో దేశ ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకున్నాం. రూ.12లక్షల వార్షిక ఆదాయం వరకు ఆదాయపు పన్ను లేకుండా చేశాం. స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లోనూ భారత్ దూసుకెళ్తోంది. భారత్ పవర్ టెక్నాలజీ హబ్‌గా రూపొందుతోంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో భారత్‌ను పవర్ హౌస్‌గా తయారు చేస్తున్నాం. భవిష్యత్‌లో 100 గిగావాట్ల న్యూక్లియర్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యం. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి చర్యలు. వికసిత్ భారత్‌లో రైతుకు అధిక ప్రాధాన్యత ఉంటుందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. గ్రామీణ ఉపాధి కల్పన కోసం జీ రామ్ జీ చట్టం తీసుకొచ్చాం. దేశాభివృద్ధిలో మహిళలకు కీలక పాత్ర కల్పించాం. ఆపరేషన్ సిందూర్.. మన సైనికుల సత్తా చాటింది. భారత్‌పై దాడిచేస్తే ఏం జరుగుతుందో ప్రపంచం చూసింది. రక్షణరంగ ఉత్పత్తుల ఎగుమతి రికార్డు స్థాయిలో పెరిగింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ డిఫెన్స్ ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. నానో చిప్‌ల తయారీపైనా భారత్ దృష్టి సారించింది. మైక్రో చిప్‌ల తయారీలో స్వయంసమృద్ధి సాధించాలి. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో 15లక్షల ఉద్యోగాలు సృష్టించగలిగాం. ముద్ర యోజన ద్వారా చిరువ్యాపారులకు భారీగా రుణాలు అందించాం. వంటి ఎన్నో ప్రభుత్వ కార్యక్రమాల్ని రాష్ట్రపతి తన ప్రసంగంలో వెల్లడించారు. పీఎం విశ్వకర్మ యోజనతో 20లక్షల మందికి శిక్షణ ఇస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. ఎన్డీఏ పదేళ్ల పాలనలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు. 100 కోట్లకు పైగా గ్యాస్ కనెక్షన్లు అందించామని.. ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్ల మందికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వికసిత్ భారత్‌లో రైతులకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చామన్నారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ సాధన కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. భవిష్యత్తును దృష్టిలోపెట్టుకొని దేశం సంస్కరణల పథంలో దూసుకెళ్తోందన్నారు. పీఎల్ఐ పథకం కింద పారిశ్రామికోత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. సముద్ర వ్యాపారాన్ని మరింత పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు. అంతకుముందు పార్లమెంట్‌కు చేరిన రాష్ట్రపతికి స్పీకర్ ఓం బిర్లా, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోదీ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమెను సాదరంగా పార్లమెంట్ భవనంలోకి తోడ్కొని వెళ్లారు.

# కిలో వెండి ధర రూ. 4,00,000

**పట్టపగ్గాలు లేని బంగారం, వెండి ధరలు**

**రూ.3,220 మేర పెరిగిన బంగారం**

**పదివేలు పెగిని 4లక్షలకు చేరిన వెండి**

**ఇన్వెస్టర్ల పెట్టుబడులతో ధరల ర్యాలీ**




**ముంబై, జనవరి 28:** దేశీయ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు పట్టపగ్గాల్లేకుండా పరుగులు తీస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ఇన్వెస్టర్ల భారీ పెట్టుబడుల కారణంగా ధరలు సరికొత్త గరిష్టాలను తాకుతున్నాయి. తాజాగా పది గ్రాముల బంగారం ధర రూ. 3,220 మేర పెరగగా, వెండి ఏకంగా కిలోకు రూ. 10,000 ఎగబాకి ఇన్వెస్టర్లను విస్మయానికి గురిచేస్తోంది. తాజా పెరుగుదలతో హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1,65,170కి చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ. 2,950 పెరిగి రూ. 1,51,400 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఇవే ధోరణులు కనిపిస్తున్నాయి. సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపడం వల్ల ఈ స్థాయి ర్యాలీ కనిపిస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో బంగారం కంటే వెండి ధరలే హాట్ టాపిక్‌గా మారాయి. 2025 జనవరిలో 30 డాలర్లున్న ఔన్సు వెండి ధర, కేవలం ఏడాది కాలంలోనే 270 శాతం పెరిగి 115 డాలర్లు దాటడం గమనార్హం. ప్రస్తుతం హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ. 4,00,000 మార్కును తాకింది. ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 3.8 లక్షలుగా నమోదైంది. సెమీకండక్టర్లు, సోలార్ ప్యానెళ్లు, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల తయారీలో వెండి వినియోగం పెరగడం, 'సిల్వర్ ఇన్‌స్టిట్యూట్' నివేదిక ప్రకారం.. పారిశ్రామిక డిమాండ్ 4 శాతం తగ్గినా, వెండి ఈటీఎఫ్ ల మార్కెట్ డిమాండ్ 225 శాతం పెరిగింది. ధరలు ఇంకా పెరుగుతాయనే భయంతో ఇన్వెస్టర్లు అత్యుత్సాహంతో పెట్టుబడులు పెట్టడం వల్ల మార్కెట్‌లో ఒక 'బబుల్‌క్రియేట్' అయ్యిందని ' విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత ధరల ర్యాలీని ఆర్థిక నిపుణులు 'అనవసరపు రద్దీ'గా అభివర్ణిస్తున్నారు. వెండికి గతంలో ధరలు పడిపోయినప్పుడు 80-90 శాతం విలువను కోల్పోయిన చరిత్ర ఉందని గుర్తు చేస్తున్నారు. షార్ట్-సెల్లర్లు తమ నష్టాలను పూడ్చుకోవడానికి చేసే ప్రయత్నాలు కూడా ధరలను పైకి నెడుతున్నాయని, ఈ దశలో కొత్తగా పెట్టుబడులు పెట్టేవారు ఆచితూచి వ్యవహరించాలని హెచ్చరిస్తున్నారు. మార్కెట్ ఒడిదుడుకులను గమనిస్తూ, తమ రిస్క్ సామర్థ్యం మేరకే నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నారు.




# సరికొత్త ఆధార్ యాప్ లాంచ్

**సరళంగా, సురక్షితంగా ఉండేలా చర్యలు**

**న్యూఢిల్లీ, జనవరి 28:** కేంద్ర ప్రభుత్వం సరికొత్త ఆధార్ యాప్‌ను లాంచ్ చేసింది. దేశ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే లక్ష్యంతో దీనిని తీసుకొచ్చింది. ఈ కొత్త యాప్‌తో ఆధార్ సర్వీసులు మరింత సరళంగా, సురక్షితంగా, యూజర్ ఫ్రెండ్లీగా మారనున్నాయి. బుధవారం దిల్లీలో డాక్టర్.అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ యాప్‌ను జాతికి అంకితం చేశారు. 2009లో ఇదే రోజున అంటే జనవరి 28న ఆధార్‌ను లాంచ్ చేశారు. ఈ యాప్ ద్వారా వెంటనే ఆధార్ వెరిఫికేషన్ చేసుకోవచ్చు. చిరునామా, మొబైల్‌నంబర్‌ను అప్‌డేట్ చేసుకునే సౌలభ్యం ఉంది. ఆధార్ కాంటాక్ట్ కార్డ్ ద్వారా అత్యంత గోప్యంగా కాంటాక్ట్ వివరాలను పంచుకోవచ్చు. ఎవరికైనా షేర్ చేసినప్పుడు మొత్తం వివరాలు కాకుండా అవసరమైనవి మాత్రమే కనిపించేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఎలాంటి సంక్లిష్టత లేకుండా యూజర్లకు అందుబాటులోకి సేవలు ఈ యాప్ ద్వారా ఐదుగురి వరకు ప్రొ÷ల్ వివరాలు క్రియేట్ చేసుకోవచ్చు.

# మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాదం

**విమాన ప్రమాదంతో డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం**

**పవార్‌తో పాటు ఇద్దరు సహాయకులు, ఇద్దరు పైలెట్లు మృతి**



**ముంబై, జనవరి 28:** మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాద ఘటన చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ అనంతరావు పవార్ బుధవారం బారామతి దగ్గర చార్టర్డ్ విమానం కూలిపోవడంతో దుర్మరణం చెందారు. ఈ ఘటనలో ఆయనతోపాటు విమానంలో ఉన్న మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. ముంబై నుంచి బారామతి వెళ్తున్న ఈ ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఉదయం 8:45 గంటల సమయంలో క్రాష్ అయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అజిత్ పవార్ వయసు 66 సంవత్సరాలు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ప్రయాణిస్తోన్న విమానం బారామతిలో ల్యాండ్ అయ్యే సమయంలో కుప్పకూలినట్టు తెలుస్తోంది. కూలిన వెంటనే విమానం నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో విమానం రెండు ముక్కలైంది. అందులోని వారంత కాలి బూడిదయ్యారు. అజిత్ పవార్.. బారామతిలో బహిరంగ సభకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు సమాచారం. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కూలిపోయి అగ్నికి ఆహుతైన విమానంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తోపాటు, మరో ఇద్దరు సిబ్బంది ఒక పీఎస్ఓ, ఒక సహాయకుడు మరో ఇద్దరు పైలట్, కో-పైలట్ మొత్తం ఐదుగురు ఉన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, విమానంలో ఉన్న ఏ ఒక్కరూ ఈ ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడలేదని డీజీసీఏ అధికారికంగా ప్రకటించింది. అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అజిత్ పవార్ వర్గం అధ్యక్షులు. మహారాష్ట్రలో అత్యధిక కాలం ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడు. 2024 డిసెంబరు 5 నుంచి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా ఉన్న మహాయుతి ప్రభుత్వంలో ఏక్‌నాథ్ షిండేతో కలిసి డిప్యూటీ సీఎంగా పనిచేస్తున్నారు. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి రక్షణ సిబ్బంది, పోలీసులు, ఫైర్ సర్వీస్ బృందాలు చేరుకున్నాయి. డిప్యూటీ సీఎం విమాన ప్రమాదంలో చనిపోయారన్న వార్త తెలిసి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మరో ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఇతర నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఈ దుర్ఘటనపై తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున ఘటనాస్థలానికి చేరుకున్నారు. బారామతి నియోజకవర్గం నుంచి బలమైన బేస్ ఉన్న అజిత్ పవార్.. శరద్ పవార్ అన్నయ్య కుమారుడు. రాజకీయంగా చాలా శక్తిమంతమైన వ్యక్తిగా ఎదిగారు. ఆయన మరణంతో మహారాష్ట్ర రాజకీయాల్లో భారీ లోటు ఏర్పడిందని పలువురు రాజకీయ ప్రముఖులు చెబుతున్నారు. పవార్ మృతితో మహాయుతి కూటమి, బారామతి ప్రాంతీయ రాజకీయాలపై తీవ్ర ప్రభావం పడనుంది.

**విమాన ప్రమాదంపై రాజకీయాలు తగవు**

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణంపై రాజకీయాలు తగవని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ స్పందించారు. విమాన దుర్ఘటన పూర్తిగా ప్రమాదమేనని.. దీన్ని రాజకీయం చేయొద్దని అన్నారు. విమాన ప్రమాదంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో తొలిసారి మీడియా ముందుకు వచ్చిన శరద్ పవార్.. అజిత్ మరణం తీవ్ర దుఃఖాన్ని మిగిల్చిందన్నారు. అజిత్ పవార్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఓ సమర్థుడైన నాయకుడిని రాష్ట్రం కోల్పోయింది. జరిగిన నష్టాన్ని పూడ్చలేం.. కానీ, ప్రతిదీ మన చేతుల్లో లేదు. దయచేసి ఈ విషాదాన్ని రాజకీయం చేయొద్దని శరద్ పవార్ విజ్ఞప్తి చేశారు.

# ఇందిరానగర్‌లో అస్తవ్యస్తంగా మారిన సీసీ రోడ్డు

**నేటి సాక్షి - రాయికల్ (ఇమ్మడి విజయ్ కుమార్):** రాయికల్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ 3వ వార్డులో రెండు నెలల క్రితం మరమ్మత్తుల నెపంతో సీసీ రోడ్డు మరియు లోకల్ వాటర్ పైపులైన్‌ను పగలగొట్టి వదిలేయడంతో కాలనీవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో స్థానికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. మూడో వార్డులోని ప్రధాన సీసీ రోడ్డుపై ప్రైమరీ స్కూల్ ఉండటంతో విద్యార్థుల రోజువారీ రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డుపై తవ్వి వదిలేసిన గుంతల వల్ల చిన్నారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో అవసరమయ్యే 108 అంబులెన్స్‌లు, ఇతర సేవా వాహనాలు కాలనీలోకి రాకపోవడంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఇదే ప్రాంతానికి సమీపంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బూత్ ఏర్పాటు





చేయనున్న నేపథ్యంలో, గుంతలు మరియు ధ్వంసమైన రోడ్డు కారణంగా ఓటర్లు పోలింగ్‌కు వచ్చే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిపై వెంటనే స్పందించి సంబంధిత అధికారులు, మున్సిపల్ యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకుని సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని ఇందిరానగర్ కాలనీ వాసులు ఏకగ్రీవంగా డిమాండ్ చేస్తున్నారు.

# శంకర్‌పల్లిలో తొలి రోజే 8 నామినేషన్లు దాఖలు



**నేటి సాక్షి, శంకర్‌పల్లి :** శంకర్‌పల్లి మున్సిపల్ ఎన్నికల 2026 ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. మున్సిపల్ కమిషనర్ నియామకంతో రిటర్నింగ్ ఆఫీసర్లు (ROs) ఎన్నికల నోటీసును విడుదల చేయడంతో నామినేషన్ల స్వీకరణకు మార్గం సుగమమైంది. నోటీసు విడుదలైన తొలి రోజే 8 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. అభ్యర్థులలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ప్రతినిధులు ఉన్నారు. ఎన్నికల అధికారులు తెలిపారు, నామినేషన్ ప్రక్రియ ఎన్నికల నియమావళి ప్రకారం ప్రశాంతంగా కొనసాగింది. అభ్యర్థుల వివరాలు,

**కాంగ్రెస్ పార్టీ నామినేషన్లు:**

ఎర్రా ఆనంద్ రావు (SCG)- 'హస్తం'
జులకంటి శ్వేత (BCW) - 'హస్తం'
కంకంటి జంగయ్య (BCG) - 'హస్తం'
వకిటొల్ల గణేష్ (STG) - 'హస్తం'
సాధా ప్రవీణ్ కుమార్ (URG) - 'హస్తం'

**బీఆర్ఎస్ పార్టీ నామినేషన్లు:**
వన్నెపగ ఉషా కిరణ్ (SCW) - 'కారు'
దండు సంతోష్ కుమార్ (URG) 'కారు'

**బీజేపీ పార్టీ నామినేషన్:**
గుంతల లక్ష్మి (URW) - 'కమలం'

ప్రతిపాదకుల సమాచారం, ఎన్నికల రోల్ నంబర్లు, ఆస్తి బాధ్యత పత్రాలను పరిశీలించిన అనంతరం నామినేషన్లను స్వీకరించినట్టు అధికారులు పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో శంకర్‌పల్లి రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధాన పార్టీలన్నీ గెలుపు లక్ష్యంతో వ్యూహాలు సిద్ధం చేస్తూ, నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసేలోపు మరిన్ని దరఖాస్తులు దాఖలయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# సీఎం కప్ క్రీడాకారుల ఎంపికకు ఆహ్వానం

**నేటి సాక్షి, ఎండపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలకు మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక కోసం అర్హులైన యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో కృపాకర్ తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియను జనవరి 30న మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో, అథ్లెటిక్స్ తదితర క్రీడా విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక జరగనుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి అర్హత కలిగిన యువత ఈ సెలక్షన్ పోటీల్లో పాల్గొనేందుకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ రసీదు తోపాటు ఆధార్ కార్డు వెంట తీసుకొని వచ్చి నమోదు చేసుకొని, తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించాలని ఎంపీడీవో కోరారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. గ్రామీణ యువతకు క్రీడల ద్వారా మంచి అవకాశాలు లభిస్తున్నాయని, సీఎం కప్ ద్వారా క్రీడాస్ఫూర్తి, ఆరోగ్య అవగాహన మరింత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు




# రైతుబంధుకి రాం రాం.. ఎన్నికల కోడ్ పేరిట రైతుకు మోసం




- ఫిబ్రవరిలో లేదు మార్చిలో కూడా సందేహమే - రైతుబంధు గల్లంతు
- ఆర్థిక సంవత్సరం ముగిస్తే రైతుబంధుకి మంగళం - కొత్త బడ్జెట్‌తో ఆశలు శూన్యం
- గతంలోనూ ఇదే నాటకం - ఎనభై శాతం రైతులకు రైతుబంధు ఎగ్గొట్టిన రేవంత్ సర్కారు
- ఓట్ల కోసమే రైతుబంధు - మూడుదఫాలుగా ఎగనామం పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

**నేటి సాక్షి మహబూబాబాద్(భూక్యా రవినాయక్) :** రైతుబంధు పథకానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పష్టంగా రాం రాం చెప్పిందా? అనే సందేహాలు రైతుల్లో తీవ్రంగా వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఫిబ్రవరి నెలలో రైతుబంధు రావడం లేదనే పరిస్థితి నెలకొంది. ఇక మార్చి నెలలో కూడా రైతుబంధు ఇచ్చే అవకాశాలు కనపడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చి నెలతో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా, ఆ తర్వాత అమల్లోకి వచ్చే కొత్త బడ్జెట్‌తో రైతుబంధు పూర్తిగా పక్కకు నెట్టే ప్రమాదం ఉందని రైతు సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఒకసారి ఆర్థిక సంవత్సరం ముగిస్తే, గతంలో జరిగినట్లే రైతుబంధు పేరుతో ప్రభుత్వం చేతులు దులుపుకునే పరిస్థితి వస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో కూడా ఇదే సాకుతో ఒక దఫా రైతుబంధును ఎగ్గొట్టిన రేవంత్ సర్కారు, రెండువేల ఇరవై ఐదు సంవత్సరంలో ఆర్థిక సంవత్సరం పూర్తయిందని చెప్పి ఎనభై శాతం మంది రైతులకు రైతుబంధు ఇవ్వకుండా తప్పించుకుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల్లో గెలిచిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధును కేవలం ఒక్కసారే ఇచ్చిందని, ఆ తర్వాత నుంచి రైతులను పూర్తిగా విస్మరించిందని రైతులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మాత్రం ఓట్ల కోసమే రైతుబంధు ఇచ్చినట్టు స్పష్టంగా కనిపిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. రెండువేల ఇరవై మూడు డిసెంబర్ నుంచి ఇప్పటివరకు మూడు దఫాల రైతుబంధుకు ఎగనామం పెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, రైతులను మోసం చేస్తోందని రైతు సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. రైతుబంధు పథకాన్ని రాజకీయ లాభనష్టాల కోసం ఉపయోగించుకోవడం మానేసి, వెంటనే పెండింగ్‌లో ఉన్న మూడు దఫాల రైతుబంధును విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే రాబోయే రోజుల్లో రైతుల ఆగ్రహం ఉద్యమ రూపం దాల్చుతుందని ప్రభుత్వం గుర్తించాలని హెచ్చరిస్తున్నారు.

# క్రీడా స్ఫూర్తితో ఎదగాలి

## అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి

**నేటి సాక్షి - రాయికల్ (ఇమ్మడి విజయ్ కుమార్):** బాలికలు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుని చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని జగిత్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికలతో ఆమె మాట్లాడుతూ, శ్రద్ధ, పట్టుదల, ఏకాగ్రతతో చదివితే మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత ఉద్యోగాలు పొందవచ్చని అన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలని



సూచించారు. అలాగే పాఠశాలలో నిర్వహిస్తున్న సిఎం కప్ క్రీడా పోటీల వివరాలను ఆమె తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాయికల్ ఎస్సై సుధీర్ రావు, ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వర శర్మ, పుర్రె రమేష్, పి. గంగాధర్, వ్యాయామ ఉపాధ్యాయులు రవీష్ రెడ్డి, భీమేష్, జగన్, నితీన్, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా జరిగిన నామినేషన్

**మున్సిపాలిటీల వారిగా**

| | |
|---|---|
| ధర్మపురి : 10 | మెట్ పెల్లి : 17 |
| జగిత్యాల : 21 | రాయికల్ : 9 |
| కోరుట్ల : 07 | మొత్తం : 64 |




**నేటి సాక్షి - జగిత్యాల(పూరెళ్ల బాపు):** మున్సిపల్ ఎన్నికలు ప్రారంభమైన నేపథ్యంలో జగిత్యాల జిల్లాలో 5 మున్సిపాలిటీలకు జరుగనున్న ఎన్నికలకు సంబంధించి మొదటి రోజు జనవరి 28వ తేది నాటి వరకు 64 నామినేషన్ లు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి బి. సత్యప్రసాద్ తెలిపారు.

# నూతన అధ్యక్షులుగా గుంటుకుల మహేందర్.




**నేటి సాక్షి, జగిత్యాల ( గుండ ప్రశాంత్ గౌడ్ ):** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం రంగాధమునిపల్లి పద్మశాలి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం పద్మశాలి సంఘ భవనంలో సమావేశం నిర్వాంచారు. సమావేశంలో మాటేటి పోషమల్లు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు గుంటుకుల మహేందర్. ఉపాధ్యక్షుడుగా పెద్దూరి తిరుపతి. ప్రధాన కార్యదర్శిగా రాపెల్లి శ్రీహరి. కోశాధికారిగా. జక్కుల మల్లేశం. సహాయ కార్యదర్శులుగా. భోగ ప్రశాంత్. ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పద్మశాలి సంఘ పెద్దలు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవకే నా జీవితం అంకితం

## గజ్వేల్ అభివృద్ధికి మరో అవకాశం ఇవ్వండి


## బీఆర్ఎస్ అభ్యర్థి గుంటుకు శిరీష రాజు



**నేటి సాక్షి గజ్వేల్:** ప్రజాసేవకే తన జీవితం అంకితం చేస్తూ, గజ్వేల్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ పార్టీ తరఫున 14వ వార్డు నుంచి బరిలోకి దిగిన అభ్యర్థి గుంటుకు శిరీష రాజు ఓటర్లను ఆదరాభిమానాలతో అభ్యర్థించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో ఆమె 14వ వార్డు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో గజ్వేల్ పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని గుర్తు చేశారు. పట్టణం చుట్టూ 23 కిలోమీటర్ల రింగ్ రోడ్డు, మహతి ఆడిటోరియం, సమీకృత కార్యాలయ భవనం, సమీకృత కూరగాయల మార్కెట్, ఆధునిక వసతులతో బస్టాండ్, జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రి వంటి కీలక మౌలిక సదుపాయాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటు అయ్యాయని తెలిపారు. అలాగే అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే ఫంక్షన్ హాల్‌లు, కుల సంఘాలకు ప్రత్యేక భవనాలు, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ప్రధాన రహదారి సుందరీకరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలు పట్టణ రూపురేఖలను మార్చేశాయని అన్నారు. సంక్షేమ రంగంలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక వినూత్న పథకాలను అమలు చేసిందని పేర్కొన్నారు. ముఖ్యంగా 1200 మంది నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిందని తెలిపారు. గతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా 19వ వార్డును అభివృద్ధి పథంలో నడిపించిన అనుభవం తనకు ఉందని, అదే స్ఫూర్తితో 14వ వార్డును కూడా ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని ఆమె హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తే, ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో 14వ వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తానని గుంటుకు శిరీష రాజు ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో గుంటుకు మల్లేశం, గుంటుకు రాజు, బీఆర్ఎస్ మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన రమేష్

## పరామర్శించిన ఎమ్మెల్సీ దండే విఠల్



**నేటి సాక్షి, కాగజ్‌నగర్:** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ ధోని రవి సోదరి కస్తూరి లక్ష్మీ (45) మరియు ఆమె కుమార్తె కస్తూరి అక్షిత (21) మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు వెళ్తుండగా ప్రయాణిస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో కస్తూరి లక్ష్మీ భర్త రమేష్‌కు తీవ్ర గాయాలు కాగా, రెండు కళ్లకు గాయాలు కావడంతో కాగజ్‌నగర్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన ఎమ్మెల్సీ దండే విఠల్ ఆసుపత్రికి చేరుకొని రమేష్‌ను పరామర్శించి ధైర్యం నింపారు. అలాగే వైద్య ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సహాయం అందించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

TGTEL/25/A1737

## కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్

**ఎంసిసి, ఎంసిఎంసి ప్రారంభం**

**మున్సిపల్ ఎన్నికల పర్యవేక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు**



**నేటి సాక్షి - జగిత్యాల( రాధారపు నర్సయ్య )**జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌తో పాటు ఎంసిసి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) మరియు ఎంసిఎంసి (మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ)లను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ఈ విభాగాలు కీలకంగా పనిచేస్తాయని ఆయన తెలిపారు. జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికలకు సంబంధించిన సమాచారం, సమస్యలు లేదా ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 9666234383ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల కోసం 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, ఆర్డీవో మధుసూదన్, జిల్లా నోడల్ అధికారులు కె. రాజ్‌కుమార్, పి. నరేష్, వి. భాస్కర్, కలెక్టరేట్ ఏవో హకీమ్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు చేయాలి

**దేవదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్**




**నేటి సాక్షి - జగిత్యాల( రాధారపు నర్సయ్య ):** 2027లో గోదావరి పుష్కరాలు జరుగనున్న నేపథ్యంలో పుష్కరాలను పకడ్బందీగా నిర్వహించే క్రమంలో బుధవారం జిల్లా కలెక్టర్ లు మరియు సంబందిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగిత్యాల జిల్లా నుండి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా దేవదాయశాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. తెలంగాణలో 2027 లో జరగబోయే గోదావరి పుష్కరాలకు సంబంధించి గోదావరి ప్రవహించే జిల్లాల్లో పుష్కరాలకు సంబందించిన ఏర్పాట్లలో భాగంగా పుష్కర ప్రదేశాలను Tier – 1, Tier 2 Tier – 3లుగా విభజించి వాటికనుగుణంగా వ్యూహత్మక ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చేపట్టబోయే పనులు సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. గోదావరి పుష్కరాలకు లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్, ఆర్డీవో మధు సూదన్, EEPR EERB EERWS ధర్మపురి ఆలయ ఈవో, కలెక్టరేట్ ఏవో తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి**

**జగిత్యాల అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి**



**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభమైన నేపథ్యంలో కోరుట్ల, రాయికల్ పట్టణాల్లో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ నామినేషన్ స్వీకరణ కేంద్రాలు, పలు పోలింగ్ కేంద్రాలను అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి బుధవారం పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, కేంద్రాల నిర్వహణ తీరు, భద్రతా ఏర్పాట్లపై అక్కడి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఎన్నికల నిబంధనల ప్రకారం 100 మీటర్ల పరిధి నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అదనపు ఎస్పీ ఆదేశించారు. అనుమతి లేకుండా వ్యక్తులను నామినేషన్ కేంద్రాల్లోకి అనుమతించవద్దని, శాంతిభద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)ను కచ్చితంగా పాటించాలని అదనపు ఎస్పీ స్పష్టం చేశారు. ఈ తనిఖీల సమయంలో ఆయన వెంట డీఎస్పీ రాములు, కోరుట్ల సీఐ సురేష్, ఎస్ఐలు చిరంజీవి, సుధీర్ రావు తదితరులు ఉన్నారు.

## వనదేవతలకు పట్టువస్త్రాలు



**నేటి సాక్షి,నల్లబెల్లి:** మద్ది మేడారంలో వనదేవతలు సమ్మక్క–సారలమ్మలకు పట్టు వస్త్రాలు సమర్పించి భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. మద్ది మేడారం ట్రస్ట్ చైర్మన్ పబ్బు రాజేష్ గౌడ్ దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో మామిండ్ల వీరయ్య పల్లి, నాగరాజు పల్లి సర్పంచులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఏడాకుల సరోజన రెడ్డి, ఎరుకల లలిత రఘున అమ్మవారికి వస్త్రాలు సమర్పించారు. అదేవిధంగా మద్ది మేడారం ఆలయ పూజారులకు కూడా ట్రస్ట్ చైర్మన్ వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తి వాతావరణంతో మేడారం ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# ఎన్నికల్లో చైర్మన్ స్థానాలను కైవసం చేసుకుంటాం



- ప్రజలు బీజేపీ వైపే ఉన్నారు
- మెట్‌పల్లిలో బీజేపీలో భారీ చేరికలు

**నేటి సాక్షి, మెట్‌పల్లి (దామ రాజేష్):** ప్రజలు భారతీయ జనతా పార్టీ వైపే ఉన్నారని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచి చైర్మన్ స్థానాలను కైవసం చేసుకుంటామని బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం మెట్ పల్లి పట్టణంలోని పలు వార్డులకు చెందిన నాయకులు బీజేపీలో చేరారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన చేరికల కార్యక్రమంలో రెండో వార్డు నుంచి యామ రాధ, ఏడో వార్డు నుంచి ధర్మపురి స్వరూప, ఇల్లెందుల లత, 16వ వార్డు నుంచి అరిసె వనజతో పాటు ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీజేపీ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందబోతున్నారని, మున్సిపల్‌లో బీజేపీ జెండాను ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్, కోరుట్ల అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, పార్టీ స్టేట్ కౌన్సిల్ మెంబర్, ప్రముఖ న్యాయవాది ఏలేటి నరేందర్ రెడ్డి, ఎనిమిదో వార్డు ఇంచార్జీ తల్లోజీ భాస్కర్, నాయకులు మిట్టపల్లి కృష్ణమూర్తి, వడ్డేపల్లి శివకుమార్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీలో చేరిన నాయకులు పాల్గొన్నారు.

# అల్లుడి ఆత్మహత్యకు కారణమైన అత్తామామలు

- ఐదేళ్ల జైలు
- రూ.2 లక్షలు ఇస్తేనే కొడుకుని ఇస్తామని వేధింపులు - మెట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు

**నేటి సాక్షి, మెట్‌పల్లి (దామ రాజేష్):** కన్నకొడుకును అప్పగించాలంటే రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అల్లుడిని మానసిక వేదనకు గురిచేసి ఆత్మహత్యకు ప్రేరేపించిన అత్తామామలు, బావమరిది సహా ఆరుగురు నిందితులకు మెట్‌పల్లి కోర్టు కఠిన శిక్ష విధించింది. నిందితులకు ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి శ్రీ డి. నాగేశ్వరరావు బుధవారం తీర్పు వెలువరించారు.

**కేసు నేపథ్యం: మనవడి కోసం వేధింపులు**

జగిత్యాలకు చెందిన జైనపురం పెద్దిరాజం (31)కు ముత్యంపేట గ్రామానికి చెందిన సునీతతో 2004లో వివాహం జరిగింది. వీరికి మురారి అనే కుమారుడు ఉన్నాడు. 2011 జూన్‌లో సునీత మృతి చెందడంతో, ఆమె తల్లిదండ్రులు తమ మనవడిని బలవంతంగా ముత్యంపేటకు తీసుకెళ్లారు. తన కుమారుడిని తనకు అప్పగించాలని పెద్దిరాజం పలుమార్లు కోరినప్పటికీ, నిందితులు నిరాకరించి అతడిని తీవ్రంగా వేధింపులకు గురిచేసినట్లు కేసు విచారణలో వెల్లడైంది.

**డబ్బు డిమాండ్.. ఆపై విషాదం**

2011 అక్టోబర్ 4న పెద్దిరాజం తన కుమారుడిని చూడటానికి ముత్యంపేటకు వెళ్లగా, అత్తామామలు, బావమరిది తదితరులు కలిసి రూ.2 లక్షలు ఇస్తేనే బాలుడిని ఇస్తామని డిమాండ్ చేశారు. అవమానాలు, వేధింపులు భరించలేక అతడు తీవ్ర నిరాశకు లోనయ్యాడు. అనంతరం చికిత్స పొందుతూ మరుసటి రోజు కరీంనగర్ ఆసుపత్రిలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని తండ్రి జైనపురం భీమయ్య ఫిర్యాదు మేరకు అప్పటి మల్లాపూర్ ఎస్సై కె. శశిధర్ రెడ్డి కేసు నమోదు చేశారు.

**మరణ వాంగ్మూలం కీలకం**

మరణానికి ముందు మేజిస్ట్రేట్ సమక్షంలో ఇచ్చిన మరణ వాంగ్మూలం ఈ కేసులో కీలక ఆధారంగా మారింది. నిందితుల వేధింపుల వివరాలను పెద్దిరాజం వివరించగా, ఆ వాంగ్మూలం మరియు ఇతర సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకుని న్యాయస్థానం నిందితులను దోషులుగా నిర్ధారించింది.

**శిక్ష పడిన నిందితులు:**

A1. సింగసాని స్వామి (మామ) – ముత్యంపేట, మల్లాపూర్ మండలం A2: సింగసాని లక్ష్మి (అత్త) – ముత్యంపేట, మల్లాపూర్ మండలం A3: సింగసాని మహేష్ (బావమరిది) – ముత్యంపేట, మల్లాపూర్ మండలం A4: ఐతరవేణి భూమేష్ – సుద్దపల్లి, పెగడపల్లి మండలంA5: రామడుగు రవి – రామడుగు గ్రామం& మండలం

A6: భాగ్యలక్ష్మి – ముత్యంపేట, మల్లాపూర్ మండలం

**పోలీసు యంత్రాంగానికి అభినందనలు**

ఈ కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టిన అప్పటి మల్లాపూర్ ఎస్సైలు కె. శశిధర్ రెడ్డి, బి. సత్యనారాయణ, చార్జ్‌షీట్ దాఖలు చేసిన సిహెచ్. రాజమౌళిని జిల్లా ఎస్పీ అభినందించారు. కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన ఏపీపీ ఆనంద్ గౌడ్, కోర్టు కానిస్టేబుల్ పి. వినోద్‌లను ఉన్నతాధికారులు ప్రశంసించారు.

# బీఆర్ఎస్‌లో చేరిన అంబటి శ్రీనివాస్



- కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా పార్టీ ప్రవేశ కార్యక్రమం

**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల పట్టణ రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీ బలపడే దిశగా మరో అడుగు పడింది. అయ్యప్ప ఆలయకమిటీ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో గులాబీ పార్టీలో చేరారు.

**కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేరికలు**

కోరుట్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్ అధికారికంగా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అంబటి శ్రీనివాస్‌కు పార్టీ కండువా కప్పి గులాబీ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన అనంతరం అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తనను ఆకర్షించాయని తెలిపారు. కోరుట్ల పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ పటిష్టంగా పని చేస్తోందని పేర్కొన్నారు.

**గులాబీ పార్టీలో పెరుగుతున్న చేరికలు**

ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, అంబటి శ్రీనివాస్ పార్టీలో చేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు కూడా పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. కోరుట్ల పట్టణంలో బీఆర్ఎస్ పార్టీపై ప్రజల విశ్వాసం పెరుగుతుండటానికి ఈ చేరికలు నిదర్శనమని పార్టీ నాయకులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరనున్నారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలి





- నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులకు పూర్తి సౌకర్యాలు కల్పించా

**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ పారదర్శకంగా, సజావుగా సాగుతోందా లేదా అనే అంశాలను ఆయా కేంద్రాల్లో స్వయంగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నామినేషన్ కేంద్రంలో అన్ని రకాల ఫారములు అందుబాటులో ఉండేలా చూడాలని, అభ్యర్థులకు అవసరమైన సమాచారం అందించేందుకు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శాంతియుత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి, కోరుట్ల ఆర్డీఓలు శ్రీనివాస్, జివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.

# కివీస్ ఘన విజయం!

## విశాఖలో కివీస్ పరుగుల వర్షం
## సీఫెర్ట్ హాఫ్ సెంచరీతో భారత్‌పై దాడి
## దూబే మెరుపు.. కానీ భారత పతనం ఆపలేకపోయాడు
## 50 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం




విశాఖపట్నం ఎప్పుడూ బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్ కావడంతో ఇరు జట్లు భారీ స్కోర్లు సాధించాయి. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 216 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 18.4 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌట్ అయ్యింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్ , డెవాన్ కాన్వే అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. సీఫెర్ట్ కేవలం 25 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతను మొత్తం 36 బంతుల్లో 62 పరుగులు చేయగా, కాన్వే 44 పరుగులు చేశాడు. చివరి ఓవర్లలో డారిల్ మిచెల్ 18 బంతుల్లోనే 39 పరుగులు చేయడంతో కివీస్ స్కోరు 215కు చేరింది. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్ చెరో రెండు వికెట్లు తీశారు.

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా వరుస వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, ఆరో నంబర్‌లో వచ్చిన శివమ్ దూబే (65 పరుగులు ఉ 23 బంతులు) తన మెరుపు బ్యాటింగ్‌తో భారత్‌ను గెలిపించే ప్రయత్నం చేశాడు. దూబే కేవలం 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి మ్యాచ్‌పై ఆశలు రేకెత్తించాడు. కానీ 15వ ఓవర్‌లో మ్యాట్ హెన్రీ వేసిన బంతి బ్యాట్‌కు తగిలి బౌలర్ ఎండ్‌లోని స్టంప్స్‌ను తాకడంతో దూబే దురదృష్టవశాత్తూ 'రన్ అవుట్' అయ్యాడు. అక్కడితో భారత్ విజయావకాశాలు ఆవిరయ్యాయి. దూబే అవుట్ అయిన తర్వాత భారత లోయర్ ఆర్డర్ బ్యాటర్లు ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయారు. మిచెల్ సాంట్నర్ తన స్పిన్ మాయాజాలంతో హర్షిత్ రాణా, జస్ప్రీత్ బుమ్రా వికెట్లను తీసి భారత్ పతనానికి కారణమయ్యాడు. సాంట్నర్ 3 వికెట్లు పడగొట్టగా, జాకబ్ డఫ్ఫీ చివరలో కుల్‌దీప్ యాదవ్‌ను అవుట్ చేసి టీమిండియా ఇన్నింగ్స్‌ను 165 పరుగుల వద్ద ముగించాడు.




# తమీమ్ రెహమాన్‌కు నాలుగేండ్ల జైలు

లంక ప్రీమియర్ లీగ్ మ్యాచ్ ఫిక్సింగ్ కేసులో కీలక తీర్పు వెలువడింది. దంబుల్లా థండర్స్ యజమాని తమీమ్ రెహమాన్‌ను కోర్టు దోషిగా తేల్చింది. అతనికి నాలుగు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. అయితే ఈ శిక్షతోపాటు, అతనిపై ఐదు సంవత్సరాల నిషేధం, 24 మిలియన్ శ్రీలంక రూపాయల జరిమానా కూడా విధించింది. బంగ్లాదేశ్ మూలానికి చెందిన తమీమ్ రెహమాన్ తనపై ఉన్న ఆరోపణలను అంగీకరించాడు. టోర్నమెంట్ సమయంలో తాను బెట్టింగ్ ఏర్పాటు చేశానని, ఒక ఆటగాడితో ఫిక్సింగ్ గురించి చర్చించానని అతను అంగీకరించాడు.శ్రీలంక అవినీతి నిరోధక చట్టం కింద తమీమ్ రెహమాన్ దోషిగా నిర్ధారించింది. ఇది 2019లో అమలులోకి వచ్చింది. రెహమాన్ 2024లో అరెస్టు అయ్యాడు. ఈ సంఘటన గురించి ఒక ఆటగాడు ఫిర్యాదు చేయడంతో మొత్తం విషయం వెలుగులోకి వచ్చింది. కొలంబో విమానాశ్రయంలో దుబాయ్‌కు పారిపోవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు రెహమాన్ అరెస్టు చేశారు. అతన్ని అదుపులోకి తీసుకున్నారు. రెహమాన్ బెయిల్‌పై విడుదలయ్యే ముందు చాలా వారాల పాటు జైలులో ఉన్నాడు. ఈ కేసులో దంబుల్లా జట్టు మేనేజర్‌గా ఉన్న పాకిస్తాన్ పౌరుడు ముజీబ్ ఉర్ రెహమాన్‌పై అరెస్ట్ వారెంట్ కూడా జారీ చేశారు.లంక ప్రీమియర్ లీగ్ 2020లో ప్రారంభమైంది. శ్రీలంకలోని ఐదు నగరాల పేర్లతో ఐదు జట్లు ఈ లీగ్‌లో పోటీపడతాయి. 2024 నాటికి టోర్నమెంట్ ఐదు సీజన్లు జరిగాయి. ప్రస్తుత ఛాంపియన్లు జాఫ్నా కింగ్స్, నాలుగుసార్లు గెలిచింది.

# భారత్‌తో ఆడుతారా? రూ.348 కోట్లు కడుతారా?

## పాకిస్థాన్ కు బ్రాడ్‌కాస్టర్స్ వార్నింగ్!




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 బరిలోకి దిగే విషయమై దాయదీ పాకిస్థాన్ నాటకం ఆడుతోంది. టోర్నీలో పాల్గొనమని, భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తామని మీడియాకు లీకులు ఇస్తూ. ఐసీసీని బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నం చేస్తోంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ఆడకుండా బంగ్లాదేశ్‌ను ఉసిగొల్పిన పాకిస్థాన్.. ఆఖరికి ఆ జట్టును ఆగం చేసింది. తాము అండగా ఉంటామని చెప్పి సైడ్ అయ్యింది. పాకిస్థాన్‌ను నమ్ముకొని బంగ్లాదేశ్ తీవ్రంగా నష్టపోయింది. అయితే టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీని బహిష్కరించినా.. భారత్‌తో మ్యాచ్ ఆడకపోయినా పాకిస్థాన్ క్రికెట్ మొత్తం సర్వనాశనమవనుంది. ముఖ్యంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు దాదాపు 38 మిలియన్ డాలర్ల(దాదాపు రూ. 348 కోట్ల) నష్టపోవాల్సి ఉంటుందని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ప్రపంచ క్రికెట్‌లో భారత్–పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్ మరో మ్యాచ్‌కు ఉండదు. యావత్ క్రికెట్ ప్రపంచం ఈ మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకిస్తోంది. దాంతో ఈ మ్యాచ్ కోసం బ్రాడ్‌కాస్టర్లు, స్పాన్సర్లు, అడ్వర్టైజింగ్ కంపెనీలు వందల కోట్లు సంపాదిస్తాయి. భారత్–పాక్ మ్యాచ్‌కు ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం దాదాపు రూ. 348 కోట్లు. ఇప్పటికే బ్రాడ్‌కాస్టర్స్ ఈ మ్యాచ్ నేపథ్యంలో ఆయా వ్యాపార సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాయి.ఒకవేళ ఈ మ్యాచ్‌ను పాకిస్థాన్ బహిష్కరిస్తే.. ఆ నష్టాన్ని పీసీబీ నుంచి వసూలు చేయనుంది. ఇందుకోసం వారు చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఐసీసీ నుంచి పాకిస్థాన్‌కు రావాల్సిన వాటాలో కోత విధించనున్నారు. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్న పీసీబీకి ఇంత మొత్తం చెల్లించడం కోలుకోలేని దెబ్బనే. కాబట్టి పాకిస్థాన్ ఐసీసీ టీ20 ప్రపంచకప్‌తో పాటు అన్ని మ్యాచ్ ఆడుతుందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో బరిలోకి దిగే పాకిస్థాన్ జట్టును పీసీబీ ఆలస్యంగా ప్రకటించినా.. టోర్నీలో పాల్గొనే విషయంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని పీసీబీ ఛైర్మెన్ మోహ్‌సిన్ నఖ్వీ తెలిపాడు. తుది నిర్ణయం జనవరి 30 లేదా ఫిబ్రవరి 2న వెల్లడిస్తామని ట్వీట్ చేశాడు.'మా ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్‌తో సమావేశమయ్యాను. ఐసీసీలో చోటు చేసుకున్న పరిణామాలన్నింటిని ఆయనకు కులంకషంగా వివరించాను. పాక్‌కు ఉన్న అన్నీ ఆప్షన్స్‌ను పరిగణలోకి తీసుకోని పరిష్కారం కనుగొనాలని ఆదేశించారు. మెగా టోర్నీలో పాల్గొనే విషయంపై తుది నిర్ణయం శుక్రవారం లేదా వచ్చే సోమవారం వెల్లడిస్తాం.'అని ట్వీట్ పేర్కొన్నాడు.

# హే పాకిస్తాన్ వరల్డ్‌కప్‌కి రావొద్దు..

## మోహ్సిన్ నఖ్వీపై కృష్ణమాచారి శ్రీకాంత్ ఫైరా

పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మొహ్సిన్ నఖ్వీ మరోసారి క్రికెట్‌ను రాజకీయాలతో ముడిపెట్టి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాజకీయ లాభాల కోసమే తరచూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న నఖ్వీ, తాజాగా టీ20 వరల్డ్‌కప్ 2026 నుంచి పాకిస్తాన్ తప్పుకునే అవకాశం ఉందనే సంకేతాలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. బంగ్లాదేశ్ జట్టు తమ మ్యాచ్‌లను శ్రీలంక లాంటి న్యూట్రల్ వేదికలకు మార్చాలన్న డిమాండ్ నేపథ్యంలో టోర్నీ నుంచి తప్పించబడినందుకు సంఘీభావంగా పాక్ కూడా వరల్డ్‌కప్‌లో పాల్గొనక పోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై భారత్ మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్రంగా స్పందించారు. పాకిస్తాన్ నిజంగానే అలాంటి ఆలోచనలో ఉంటే, భారత్‌కు రావద్దంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఉపఖండంలో జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌లో భారత జట్టు టైటిల్‌కు ఫేవరెట్‌గా ఉంది.. ఇలాంటి పరిస్థితుల్లో పాకిస్తాన్ భారత్‌లో ఆడితే ఘోరంగా ఓడిపోతుందని శ్రీకాంత్ పేర్కొన్నారు. గత మ్యాచ్‌లో భారత్ 15 ఓవర్లలో 209 పరుగులు చేసింది.. ఈ మ్యాచ్‌లో 10 ఓవర్లలోనే 150 పరుగులు సాధించింది.. ఇది చూసి కొన్ని జట్లు 'మేము రావడం లేదు, కప్ మీరే ఉంచుకోండి' అని చెప్పే పరిస్థితికి వచ్చాయని మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తెలిపారు. పాకిస్తాన్‌కు నా సూచన– మీరు రావొద్దు.. మీ మొహ్సిన్ నఖ్వీ కూడా అదే అంటున్నారు కదా, అయితే రాకండి అని హెచ్చరించాడు. మిమ్మల్ని మైదానంలో చిత్తు చేస్తారు.. కొలంబోలో కొట్టిన సిక్స్ మద్రాస్‌లో పడేలా ఉంది.. జాగ్రత్త, రాకుండా ఏదైనా కారణం చెప్పి తప్పించుకోవడమే పాకిస్థాన్ కి ఉత్తమం అంటూ విమర్శించారు. ఇలాంటి దూకుడు బ్యాటింగ్‌ను టీ20 క్రికెట్‌లో తాను ఎప్పుడూ చూడలేదని శ్రీకాంత్ చెప్పుకొచ్చారు. అయితే, పీసీబీ చీఫ్ మొహ్సిన్ నఖ్వీ వ్యాఖ్యల అనంతరం కొద్ది గంటలకే పాకిస్తాన్ టీ20 వరల్డ్‌కప్‌కు తమ జట్టును ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. జట్టు ప్రకటన తర్వాత నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పాకిస్తాన్ మేనేజ్‌మెంట్ కీలక విషయాన్ని వెల్లడించింది. టీ20 వరల్డ్‌కప్‌లో పాల్గొనేందుకు ఇప్పటి వరకు ప్రభుత్వ అనుమతి రాలేదని, తుది నిర్ణయం ప్రభుత్వ చేతుల్లోనే ఉందని స్పష్టం చేసింది. ఇక, క్రికెట్‌కు పాకిస్థాన్, బంగ్లాదేశ్ రాజకీయ రంగు పులుముతున్న ఈ పరిణామాలు, రాబోయే టీ20 వరల్డ్‌కప్‌పై అనిశ్చితిని పెంచుతున్నాయి. పాకిస్తాన్ నిజంగా టోర్నీ నుంచి తప్పుకుంటుందా? లేక చివరి నిమిషంలో నిర్ణయం మారుతుందా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# మీరు తప్పుకుంటే మేము రెడీ..

## పాకిస్థాన్‌కు ఐర్లాండ్ అల్టిమేటం




పాకిస్థాన్ క్రికెట్ బోర్డుతమ జట్టు ప్రపంచకప్‌లో ఆడటంపై ఇంకా స్పష్టత ఇవ్వకపోవడంపై ఐర్లాండ్ క్రికెట్ బోర్డు వేసిన కౌంటర్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. వచ్చే టీ20 ప్రపంచకప్‌లో తమ జట్టు పాల్గొంటుందా లేదా అనే విషయంలో పాకిస్థాన్ ఇంకా దోబూచులాడుతోంది. భద్రతా కారణాలు లేదా ప్రభుత్వ అనుమతి సాకులు చూపుతూ పీసీబీ కాలయాపన చేస్తుండటంతో, ఐర్లాండ్ క్రికెట్ బోర్డు అత్యంత వ్యంగ్యంగా స్పందించింది. ఒకవేళ పాకిస్థాన్ గనుక ప్రపంచకప్ నుండి తప్పుకుంటే , ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఐర్లాండ్ ప్రకటించింది. అయితే, ఈ ప్రకటనలో వారు జోడించిన లాజిస్టికల్ కష్టాలు ఇప్పుడు అందరినీ నవ్విస్తున్నాయి. ఐర్లాండ్ తన ట్వీట్‌లో ఇలా పేర్కొంది– "పాకిస్థాన్ తమ నిర్ణయాన్ని త్వరగా చెబితే బాగుంటుంది. ఫిబ్రవరి 2న వారు తప్పుకుంటున్నట్లు ప్రకటిస్తే, మేము వెంటనే విమానం ఎక్కడానికి సిద్ధం. కానీ, ఫిబ్రవరి 7 నాటికి కొలంబో చేరుకోవాలంటే విమాన ప్రయాణ షెడ్యూల్స్ మాకు ఒక పెద్ద పీడకలలా మారతాయి. సమయానికి చేరుకోవడం మాకు చాలా ముఖ్యం.". పాకిస్థాన్ నిర్ణయం కోసం ఎదురుచూడటం వల్ల కలిగే అసౌకర్యాన్ని ఐర్లాండ్ చాలా సున్నితంగా, హాస్యంగా ఎత్తిచూపింది. ఈ పోస్ట్‌లో అన్నింటికంటే హైలైట్ ఏమిటంటే.. "మా ఓపెనింగ్ బ్యాటర్ ఒక ఇన్సోమ్నియాక్ అంటే నిద్రలేమితో బాధపడే వ్యక్తి !" అని పేర్కొనడం. అంటే, విమాన ప్రయాణాల్లో జాప్యం జరిగితే లేదా షెడ్యూల్స్ తారుమారైతే, నిద్రలేని తమ ఓపెనర్ పరిస్థితి ఏంటని ఐర్లాండ్ చమత్కరించింది. ఈ హిలేరియస్ పోస్ట్ చూసిన నెటిజన్లు.. పాకిస్థాన్‌ను ఇంతకంటే బాగా ఎవరూ అవమానించలేరు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అంతర్జాతీయ క్రికెట్ వేదికపై ఒక బోర్డు మరో బోర్డును ఇలా ఆటపట్టించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ప్రస్తుతం పాకిస్థాన్ ప్రభుత్వం నుండి అనుమతి రాకపోవడంతో ఆ జట్టు మెగా టోర్నీకి రావడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఐర్లాండ్ వేసిన ఈ కౌంటర్‌తో పీసీబీ ఆత్మరక్షణలో పడింది. ఒకవేళ పాకిస్థాన్ రాకపోతే ఐర్లాండ్‌కు లక్కీ ఛాన్స్ దక్కుతుంది, కానీ ఆ ప్రయాణ గందరగోళాన్ని వారు ఎలా తట్టుకుంటారో అన్నది ఇప్పుడు క్రికెట్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ట్వీట్ దెబ్బకు పాక్ బోర్డు వేగంగా స్పందిస్తుందేమో చూడాలి.

నేటి సాక్షి
TGTEL/25/A1737

కరీంనగర్

గురువారం
29 జనవరి 2026

# పెళ్లి చూపుల నుంచి నేటి వరకు




## ఒత్తిడి తట్టుకుంటూనే ఉన్నా: తరుణ్ భాస్కర్

తెలుగు సినీ పరిశ్రమలో వైవిధ్యమైన సినిమాలతో అలరిస్తున్నవారిలో తరుణ్ భాస్కర్ ఒకరు. తన ప్రత్యేక కథా శైలి, వినూత్న ప్రయత్నాలతో ఆయనను 'స్టోరీ మేకర్'గా గుర్తిస్తారు. తాజాగా ఆయన దర్శకత్వంలో రూపొందిన 'ఓం శాంతి శాంతి శాంతిః' జనవరి 30న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా తరుణ్ భాస్కర్ మీడియాతో తన ప్రయాణాన్ని పంచుకున్నారు. తరుణ్ తన కెరీర్ మొదటి సినిమాగా వచ్చిన 'పెళ్లి చూపులు' విజయాన్ని గుర్తు చేసుకుంటూ, 'ఆ విజయం నా కోసం ఎక్కువ ఒత్తిడిని తెచ్చింది' అని చెప్పారు. ఆ సమయంలో ఆయనకు ఎదురైన భయాలు, ఆందోళనలు, విజయంతో పాటు వచ్చిన బాధ్యతలన్నీ మామూలు అనుభవం కాదని అన్నారు. సినిమా రిలీజ్ సమయంలో హార్ట్ ఎటాక్ వచ్చినంత పనైందని స్పష్టం చేశాడు. విజయాన్ని సులభంగా స్వీకరించడం, అపజయాన్ని అధిగమించడం నిజమైన విద్య అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సినిమాలో హీరోయిన్ గా ఈషా రెబ్బ నటించగా, యూత్ ఫుల్ ఎలిమెంట్స్, హ్యూమర్, సెంటిమెంట్ అన్నీ తగినంత మేళవించ బడ్డాయని తెలిసింది. తరుణ్ తన ప్రత్యేకమైన శైలిలో కథను రాసి, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారని నిర్మాతలు తెలిపారు. కేవలం దర్శకుడిగా కాకుండా, నటుడిగా కూడా తన మార్క్ సినిమాలను కొనసాగిస్తూ, ప్రతి సినిమాతో లోకల్ కల్చర్ ను విశేషంగా ప్రతిబింబించాలను కుంటున్నారని ఆయన చెప్పినారు. తరుణ్ భాస్కర్ ఈ ప్రయాణంలో ఒక బలమైన పాఠాన్ని అందించారు. విజయం వచ్చినా, విఫలం అయినా, దానిని తట్టుకోవడమే నిజమైన గెలుపు. 'పెళ్లి చూపులు' నాటి ఆందోళనల నుండి నేడు 'ఓం శాంతి శాంతి శాంతిః' వరకు ఆయన నిరంతర కృషి, క్రియేటివిటీ, ధైర్యం యువ దర్శకులకు మార్గదర్శకం. జనవరి 30న విడుదలయ్యే ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



# అక్కకు తమ్ముడు రామ్‌చరణ్ గిఫ్ట్

మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచిన చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా రీజినల్ ఇండస్ట్రీలో హిట్‌గా నిలిచి, బాక్సాఫీస్ వద్ద వసూళ్ల ప్రభంజనం సృష్టించింది. చాలా కాలం తర్వాత చిరంజీవిని ఫుల్ ఫామ్‌లో చూసిన అభిమానులు ఈ సినిమాను పండగలా సెలబ్రేట్ చేశారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను సుస్మిత కొణిదెల, సాహు గారపాటి నిర్మించగా, ప్రతి వర్గం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ చిత్రాన్ని అంత అద్భుతంగా నిర్మించినందుకు రామ్ చరణ్.. తన సోదరి సుస్మితకి క్యూట్ గిఫ్ట్ ఇచ్చారు.సుస్మిత కొణిదెల రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. నాన్నకి చాలా మంచి గిఫ్ట్ ఇచ్చావు.సినిమా చాలా అద్భుతంగా వచ్చింది.ఇప్పుడు నీకు దిష్టి తగులుతుంది కాబట్టి ఇది వేసుకో అని రామ్ చరణ్ తన అక్కకి ఈవిల్ ఐ బ్రేస్‌లెట్‌ని గిఫ్ట్‌గా ఇచ్చాడని రామ్ చరణ్ సోదరి సుస్మిత తెలియజేశారు. తమ్ముడు చూపించిన ప్రేమపై మెగా డాటర్ ఫుల్ ఖుష్ అయింది. ఆమె చేసిన కామెంట్స్ కూడా ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.






# సెట్‌లో మమ్ముట్టికి సన్మానం

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టికి కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. దాదాపు 40 ఏండ్లుగా సినిమా రంగంలో అతడు అందిస్తున్న సేవలకు గాను ఈ అవార్డును కేందప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ శుభసందర్భంగా ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'పాదయాత్ర' సినిమా షూటింగ్ సెట్స్‌లో చిత్ర బృందం మమ్ముట్టిని ఘనంగా సన్మానించింది. భారత ప్రభుత్వం 2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశంలోనే మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌ను ఆయనకు ప్రకటించడంతో సెట్స్‌లో పండుగ వాతావరణం నెలకొంది. లెజెండరీ దర్శకుడు అడూర్ గోపాలకృష్ణన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం సెట్స్‌లో యూనిట్ సభ్యులందరూ కలిసి మమ్ముట్టిని సత్కరించి తమ సంతోషాన్ని పంచుకున్నారు. దాదాపు 32 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మమ్ముట్టి మరియు అడూర్ గోపాలకృష్ణన్ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటం, అదే సమయంలో ఈ గౌరవం దక్కడం విశేషం. గతంలో 1998లో పద్మశ్రీ, 2022లో కేరళ ప్రభ పురస్కారాలు అందుకున్న మమ్ముట్టి ఇప్పుడు పద్మభూషణ్ గ్రహీతగా నిలిచారు.



# ఓంశాంతి మూవీకి కపుల్స్‌కు ఆఫర్

తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా జంటగా నటించిన చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః' సినిమా శుక్రవారం విడుదల కానుంది. గురువారం ప్రదర్శించనున్న పెయిడ్ ప్రీమియర్స్ టికెట్లపై చిత్ర బృందం.. కపుల్స్‌కు ఆఫర్ ప్రకటించింది. ఒక టికెట్ కొంటే మరొటి ఉచితంగా పొందచ్చని తెలిపింది. ప్రస్తుతానికి.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రీమియర్స్ ప్రదర్శించనున్న థియేటర్ల జాబితాను వెల్లడించింది. ఆ వివరాలివీ.. మరోవైపు, తక్కువ ధరకే తమ సినిమాని చూడొచ్చంటూ రెగ్యులర్ షో టికెట్లపై చిత్ర బృందం ఇప్పటికే ఆఫర్ ప్రకటించింది. సింగిల్ స్క్రీన్స్‌లో రూ.99? జీఎస్టీ; మల్టీప్లెక్స్‌ల్లో రూ.150 జీఎస్టీ. అహంకారం కగిలిన భర్తకు భార్య ఎలా బుద్ధి చెప్పిందన్న కథాంశంతో దర్శకుడు ఏఆర్ సజీవ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 'పెళ్లిచూపులు', 'ఈ నగరానికి ఏమైంది' తదితర చిత్రాలతో దర్శకుడిగా సత్తా చాటిన తరుణ్ భాస్కర్ హీరోగా నటించిన తొలి సినిమా ఇది.

# సుహాస్ మూవీ హే భగవాన్



'కలర్ ఫోటో', 'రైటర్ పద్మభూషణ్' వంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సుహాస్, ఇప్పుడు 'హే భగవాన్'తో మరోసారి నవ్వించడానికి సిద్ధమయ్యారు. గోపి అచంట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'రైటర్ పద్మభూషణ్' ఫేమ్ షణ్ముఖ ప్రశాంత్ కథను అందించగా, వివేక్ సాగర్ సంగీతాన్ని సమకూర్చారు. వెన్నెల కిషోర్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా, త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై బి. నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తండ్రీకొడుకుల మధ్య ఉండే ఎమోషన్‌తో పాటు ఆద్యంతం వినోదాన్ని పంచే ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 20న విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది. ఒక రహస్యమైన 'ఫ్యామిలీ బిజినెస్' చుట్టూ తిరిగే ఈ కథలో ఆ వ్యాపారం ఏంటో ఎవరికీ చెప్పకూడదనే ఆసక్తికర నిబంధనతో సాగే తండ్రీకొడుకుల ప్రయాణం హిలేరియస్‌గా ఉండబోతోందని టీజర్ చూస్తే అర్థమవుతోంది. 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు' తర్వాత సుహాస్ మరియు శివాని నాగరం ఈ చిత్రంతో మరోసారి జంటగా నటిస్తున్నారు. ఎలాగైనా నాన్న బిజినెస్‌ను తాను టేకప్ చేయాలని తాపత్రయ పడే పాత్రలో సుహాస్ నవ్వులు పూయిస్తున్నారు. 'ఎంతో మంది ఇళ్లలో దీపాలు వెలిగించాడండీ..' అనే డైలాగులతో పాటు శివాని నాగరం జోక్స్ ఆకట్టుకుంటున్నాయి.

# బోర్డర్-3ని అనౌన్స్ చేసిన టీ సీరిస్

సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన 'బోర్డర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. రిపబ్లిక్ డే కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం కేవలం ఐదు రోజుల్లోనే రూ.200 కోట్ల మార్కును అందుకుంది. అయితే ఈ సినిమా సాధించిన భారీ విజయాన్ని పురస్కరించుకుని తాజాగా చిత్ర నిర్మాతలు 'బోర్డర్ 3' గురించి అధికారిక ప్రకటన చేశారు. టీ-సిరీస్ అధినేత భూషణ్ కుమార్ మరియు జేపీ ఫిల్మ్స్ నుంచి నిధి దత్తా కలిసి ఈ ఐకానిక్ ఫ్రాంచైజీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు చేతులు కలిపారు. ప్రస్తుతం థియేటర్లలో సన్నీడియోల్, వరుణ్ ధావన్, దిల్జిత్ దోసాంజ్ వంటి స్టార్లతో అలరిస్తున్న 'బోర్డర్ 2' ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి బ్లాక్ బస్టర్ దిశగా దూసుకుపోతోంది. ఈ ఓపెనింగ్ వీకెండ్ సక్సెస్ ఇచ్చిన ధీమాతోనే 'బోర్డర్ 3' ప్రాజెక్టును పట్టాలెక్కించడానికి నిర్మాతలు సిద్ధమయ్యారు. ఈ మూడవ భాగంలో కూడా సన్నీ డియోల్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారని సమాచారం ఉండగా.. మిగిలిన నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు. దాదాపు ముప్పై ఏళ్ల తర్వాత మళ్లీ అదే దేశభక్తిని వెండితెరపై ఆవిష్కరించి, ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ పొందుతున్నామని, అందుకే ఈ స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని 'బోర్డర్ 3'తో కొనసాగిస్తున్నామని నిర్మాతలు సగర్వంగా ప్రకటించారు.




Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# ఇందన పొదుపు అవార్డు

**అందించిన డిఎం వినయ్ కుమార్**



**నేటి సాక్షి పాములపాడు :** పాములపాడు గ్రామానికి చెందిన మధుసూదన్ స్టాప్ నెంబర్ 42 78 02కు ఉత్తమ ఇంధన పొదుపు జ్ఞాపిక అవార్డును ఆత్మ కూరు డిపో డిఎం డిఎం వినయ్ కుమార్ ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్టీసీ డ్రైవర్ మధుసూదన్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో డ్రైవరుగావిధులు నిర్వహిస్తున్నాను లాంగ్ డిస్టెన్స్ విభాగంలో ఇంధనం లీటర్ డీజిల్ కు 5.53 కిలోమీటర్లు మైలేజ్ రావడంతో నాకు ఉత్తమమైన పొదుపు జ్ఞాపిక అవార్డు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు ఈ అవార్డుతో నామీద విధి నిర్వహణలో ఇంకా బాధ్యత పెరిగిందని ఆత్మకూరు ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు ఈ సందర్భంగా తోటి డ్రైవర్లు మరియు బంధుమిత్రులు స్నేహితులు శుభాకాంక్షలు అభినందలు అభినందనలు తెలియజేశారు

# మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు

**కరీంనగర్ కార్పొరేషన్‌లో అభ్యర్థుల హడావుడి**



**నేటి సాక్షి, కరీంనగర్:** మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్నారు. కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన నామినేషన్ కౌంటర్ల వద్ద బుధవారం పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లను అధికారులకు అందజేశారు. 53వ డివిజన్ నుంచి మాజీ కార్పొరేటర్ మెండి శ్రీలతా చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీ తరపున నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుండటంతో కార్పొరేషన్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. అధికారులు ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను నిర్వహిస్తున్నారు.

# సమష్టిగా కాంగ్రెస్‌ను గెలిపించాలి


**మైనార్టీ నాయకులు పార్టీలో చేరిక - వెలిచాల రాజేందర్‌రావు**



**నేటి సాక్షి, కరీంనగర్:** ముస్లిం మైనార్టీ నాయకులు సమష్టిగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కరీంనగర్ అసెంబ్లీ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ 5వ డివిజన్‌కు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైనుల్లా బుద్దిన్, ఇమాముదీన్ ముబిన్, రజాక్ కెరుద్దీన్, అబ్దుల్ రషీద్‌తో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# అభివృద్ధి పనులపై తీర్మానం

**అధికారులకు వినతి పత్రం అందజేత**



**నేటి సాక్షి, నారాయణపేట ( ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలో గున్మకుల గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో పలు అభివృద్ధి అంశాలపై చర్చించి కీలక తీర్మానాలు చేశారు. గ్రామ అభివృద్ధికి సంబంధించి ప్రధానంగా ఈవో (పంచాయతీ) భవనం నిర్మాణం, రైతులు పంటలను నిల్వ చేసుకునేందుకు గోదాం నిర్మాణం, గ్రామంలో మొబైల్ సిగ్నల్ సమస్య పరిష్కారం వంటి అంశాలపై తీర్మానాలు చేశారు. సిగ్నల్ లేమి కారణంగా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామసభలో సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని కోరుతూ చేసిన తీర్మానాలను సంబంధిత అధికారులకు వినతి పత్రంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనంతమ్మ అయ్యప్ప, ఉప సర్పంచ్ నర్సింలు, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# 20వ వార్డు అభ్యర్థిగా స్వాతి వెంకటేష్ గౌడ్



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా 20వ వార్డు కౌన్సిలర్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా స్వాతి వెంకటేష్ గౌడ్ నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమంలో అవార్డు అధ్యక్షులు దేవానంద్ చారి అభ్యర్థిగా స్వాతి వెంకటేష్ గౌడ్ ను ప్రపోజ్ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ స్వీయంగా నామినేషన్ పత్రాలను సమర్పించి అధికారుల వంతు ధృవీకరణ పొందారు.

# ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి






- **మున్సిపల్ ఎన్నికల కోడ్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య):** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జగిత్యాల జిల్లాలో ఎన్నికల కోడ్ నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) బి. రాజ గౌడ్ పాల్గొన్నారు.

**ప్రచార నియమాలకు కట్టుబడి ఉండాలి**

ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన గోడ రాతలు, వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీ బ్యానర్లు వెంటనే తొలగించాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల దూరం నిబంధనను కచ్చితంగా పాటించాలని తెలిపారు. అలాగే ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

**ఖర్చులు, కరపత్రాలపై స్పష్టత**

రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి ఎన్నికల ఖర్చులు వినియోగించుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ప్రచార కరపత్రాలపై తప్పనిసరిగా ప్రింటర్ వివరాలు ఉండాలని తెలిపారు.

జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా మరియు పారదర్శకంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా నోడల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల బల్దియా ఎన్నికలు హాట్ టాపిక్

- **నేటి నుంచే నామినేషన్ రష్ మూడు రోజుల పాటు కొనసాగనున్న ప్రక్రియలి**
- **పట్టణ పాలన కోసం హై వోల్టేజ్ పోరు జగిత్యాల బల్దియా ఎన్నికలు హాట్**
- **బల్దియా యుద్ధానికి రంగం సిద్ధం సమరానికి బిగ్ సిగ్నల్ జగిత్యాలలో నామినేషన్ ఫైర్**




**నేటి సాక్షి జగిత్యాల-( ఇమ్మడి విజయ్ కుమార్ ):** జగిత్యాల మున్సిపాలిటీలో నిర్వహించనున్న 2వ సాధారణ ఎన్నికలు–2026కు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమవుతుందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఈ నెల 28 నుంచి 30 తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. రెండు కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణమున్సిపల్ పరిధిలోని వార్డులను రెండు భాగాలుగా విభజించి నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. వార్డు నెం.1 నుంచి 21 వరకు పోటీచేసే అభ్యర్థుల నామినేషన్లు జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో, వార్డు నెం.22 నుంచి 50 వరకు అభ్యర్థుల నామినేషన్లు విద్యానగర్‌లోని మెప్మా భవనంలో స్వీకరించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాల్లో మొబైల్ ఫోన్లకు అనుమతి ఉండదని పేర్కొన్నారు. డిపాజిట్ వివరాలు ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ దాఖలు సమయంలో భద్రతా మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. SC ST BC అభ్యర్థులకు రూ. 2,500, ఇతర అభ్యర్థులకు రూ. 5,000 డిపాజిట్‌గా నిర్ణయించారన్నారు.

**అర్హతలు - నిబంధనలు**

అభ్యర్థి మున్సిపాలిటీ పరిధిలోని ఏదైనా ఒక డివిజన్‌లో ఓటరై ఉండాల్సి ఉంటుందని, అయితే ప్రతిపాదకుడు మాత్రం అదే డివిజన్‌కు చెందిన ఓటరై ఉండటం తప్పనిసరి అని అధికారులు తెలిపారు. ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరవాల్సి ఉండగా, ఎన్నికల ఖర్చులన్నీ ఆ ఖాతా ద్వారానే నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పరిమితులునామినేషన్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో రెండు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, అభ్యర్థి సహా ముగ్గురు మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తామని తెలిపారు. అఫిడవిట్ తప్పనిసరి. నామినేషన్ సమయంలో అఫిడవిట్ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని, ఇందులో. క్రిమినల్ కేసుల వివరాలు, ఆస్తులు–అప్పుల వివరాలు,

**ఆదాయ వనరులు,**

విద్యార్హత వివరాలు పొందుపరచాల్సి ఉంటుందన్నారు. ఇతర తప్పనిసరి పత్రాలునామినేషన్ పత్రంతో పాటు ఓటర్ ఐడీ లేదా ఆధార్ కార్డు, రిజర్వ్ డివిజన్ అయితే SC ST దీజ ధృవీకరణ పత్రం, ఇద్దరు ప్రతిపాదకుల సంతకాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. నామినేషన్ సమర్పించిన అనంతరం రసీదు తీసుకోవాలని, స్క్రూటినీ రోజున అభ్యర్థి లేదా అధికార ప్రతినిధి తప్పనిసరిగా హాజరుకావాలని ఎన్నికల అధికారులు సూచించారు.

# బీఆర్ఎస్ లీగల్ సెల్ చీఫ్ కన్వీనర్‌గా బైరి విజయ్

- **కోరుట్ల పట్టణ-మండల కో-కన్వీనర్లకు నియామక పత్రాలు అందజేత**



**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ కోరుట్ల పట్టణ, మండల లీగల్ సెల్ చీఫ్ కన్వీనర్‌గా బైరి విజయ్ కుమార్‌ను నియమించినట్లు బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తెలిపారు. బుధవారం కోరుట్లలో జరిగిన కార్యక్రమంలో లీగల్ సెల్ కన్వీనర్, కో–కన్వీనర్ల నియామకాలను ఆయన అధికారికంగా ప్రకటించి నియామక పత్రాలను అందజేశారు.

**కో-కన్వీనర్లుగా పలువురికి బాధ్యతలు**

ఈ సందర్భంగా కోరుట్ల పట్టణ, మండల బీఆర్ఎస్ లీగల్ సెల్ కో–కన్వీనర్లుగా సుతారి నవీన్ కుమార్, వనపర్తి క్రాంతికుమార్, వేముల నాగరాజు, కటుకం రాజేష్, ఊరడి నరేందర్, రాస గౌతమ్, అల్వాల వినయ్ కుమార్, సదుల మాధురి, ఓటారికారి రంజిత, గట్ల సృజన్ కుమార్‌లను నియమిస్తూ వారికి బాధ్యతలు అప్పగించారు. పార్టీ న్యాయపరమైన వ్యవహారాల్లో లీగల్ సెల్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని జిల్లా అధ్యక్షుడు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**నూతన బాధ్యతలపై హర్షం**

ఈ నియామకాల పట్ల కోరుట్ల మండల బీఆర్ఎస్ అధ్యక్షులు దారిశెట్టి రాజేష్, సింగిరెడ్డి నారాయణ రెడ్డి, కోరుట్ల పట్టణ బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి గుడ్ల మనోహర్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన లీగల్ సెల్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా నియమితులైన చీఫ్ కన్వీనర్, కో–కన్వీనర్లు పార్టీ న్యాయపరమైన కార్యకలాపాలను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

# ధన్వాడలో గుట్టల తవ్వకం..రాత్రి పగలు కొనసాగుతున్న టిప్పర్లు





- **గ్రామీణ రహదారులు ధ్వంసం అధికారుల నిర్లక్ష్యంపై సీపీఐ నేత పి. వెంకటేష్ ఆరోపణ**

**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రంలో ప్రభుత్వ వనరులైన గుట్టలను విచ్చలవిడిగా తవ్వేస్తూ అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సీపీఐ నారాయణపేట జిల్లా కార్యవర్గ సభ్యుడు పి. వెంకటేష్ ఆరోపించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాత్రి పగలు తేడా లేకుండా టిప్పర్లు తిరుగుతూ గుట్టలను తవ్వి భూములను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని విమర్శించారు. అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఈ అక్రమాలు జోరుగా సాగుతున్నాయని తెలిపారు.

**గ్రామీణ రహదారులు అధ్వానం**

గుట్టల తవ్వకం వల్ల గ్రామీణ రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయని, భారీ టిప్పర్ల రాకపోకలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వనరులైన గుట్టలను జిల్లా స్థాయి అధికారులు వెంటనే కాపాడాలని, అక్రమ టిప్పర్లను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ధన్వాడ మండల కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

**అనుమతులు ఇవ్వలేదు - తహసిల్దార్**

ఈ విషయంపై స్పందించిన ధన్వాడ మండల తహసిల్దార్ సింధుజ, మండలంలో మొరం టిప్పర్లకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. అక్రమంగా టిప్పర్లు కొనసాగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# జగిత్యాల మున్సిపాలిటీలో అవినీతి బట్టబయలు

- సత్యాలు మాట్లాడితే ఉలిక్కిపడుతున్నారు : జీవన్ రెడ్డి



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో ( రాధారపు నర్సయ్య )** ఇందిరా భవన్‌లో ప్రెస్‌మీట్ జగిత్యాల పట్టణంలోని స్థానిక ఇందిరా భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జగిత్యాల మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిని తీవ్రంగా ఎండగట్టారు. సంజయ్ చేసిన అవినీతిపై వాస్తవాలు మాట్లాడితే ఉలిక్కిపడుతున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

### మున్సిపల్ పాలనలో అస్తవ్యస్తం

ఐదు సంవత్సరాల కాలంలో జగిత్యాల మున్సిపాలిటీలో ఏకంగా 16 మంది మున్సిపల్ కమిషనర్లు మారారని, ఇది దేశంలో ఎక్కడా లేని పరిస్థితి అని జీవన్ రెడ్డి అన్నారు. ఇందులో ఎనిమిది మంది కమిషనర్లు జైలుపాలయ్యారని తెలిపారు. ప్రజలు ఎన్నుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కూడా వేధింపులు తట్టుకోలేక తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. బలహీన వర్గాలు, మహిళలకు కేటాయించిన స్థానాల్లో కూడా వారి హక్కులను కాలరాస్తూ అన్యాయం చేశారని ఆరోపించారు.

### రోడ్లు, మార్కెట్ అంశాలపై విమర్శలు

ఎల్ఎల్ గార్డెన్ 60 ఫీట్ల రోడ్ నిర్మాణంపై తాను అడ్డుకుంటున్నానని ఆరోపించడం అవాస్తవమని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా అన్ని కలెక్టర్లతో చర్చించి, ప్రజలను ఒప్పించి రోడ్డు వెడల్పు విస్తరణకు సహకరించానని తెలిపారు. పదేళ్లుగా అధికారంలో ఉన్నవారే పాలన చేస్తున్నారని, అడ్డంకులు ఎవరు సృష్టించారని ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ వెజ్ - నాన్ వెజ్ మార్కెట్ ప్రారంభించి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ వినియోగంలోకి రాలేదని, బిల్లులు రాలేదని చెప్పి దానిని సిమెంట్ గోదాంగా మార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోయినా పట్టించుకోకుండా, కొందరిని మాత్రమే వెనుకేసుకుని రావడం ద్వంద్వ వైఖరేనని విమర్శించారు.

### అభివృద్ధి పనులపై స్పష్టత

యావర్ రోడ్డుపై అక్రమ, అనుమతులకు విరుద్ధమైన నిర్మాణాలను తొలగించాలని కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో తన వంతు బాధ్యతగా ఈ చర్యలు తీసుకున్నానన్నారు. ముఖ్యమంత్రి కి వినతి పత్రం అందజేసిన వెంటనే కలెక్టర్ 100 కోట్ల నిధుల కేటాయింపుకు ప్రతిపాదనలు పంపారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004లో జగిత్యాల ప్రజలకు 25 కోట్లతో త్రాగునీటి సరఫరా నిధులు మంజూరయ్యాయని, కేసీఆర్ వంతెన నిర్మాణానికి 70 కోట్లు ఇచ్చారని తెలిపారు. అయితే గత ఐదేళ్లలో మున్సిపల్ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిందని ఆరోపించారు.

### కాంగ్రెస్ కార్యకర్తల హక్కులపై పోరాటం

ఉమ్మడి రాష్ట్రంలో జేఎన్‌టీయూ, వ్యవసాయ కళాశాల, ఎన్‌ఏసీ సెంటర్ వంటి అభివృద్ధి కార్యక్రమాలను జగిత్యాలకు తీసుకువచ్చామని జీవన్ రెడ్డి గుర్తుచేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 200 రూపాయలకే నల్ల కనెక్షన్ అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తలకు టికెట్లు దక్కాలని, వారి శ్రమను దోచుకునే వారిని సహించబోమని హెచ్చరించారు. తాను అడ్డుకుంటున్నానని ఆరోపించడం అసత్యమని, మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిని తాము పట్టించామని స్పష్టం చేశారు.

# సైబర్ నేరాలు ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి



**నేటి సాక్షి-మేడిపల్లి:** ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మేడిపల్లి వారి ఆధ్వర్యంలో భీమారం మండల కేంద్రంలో ఆర్బీఐ అక్షరాస్యత కేంద్రం మేడిపల్లి వారి ఆధ్వర్యంలో సైబర్ నేరాలు -ఆర్థిక మోసాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఎక్కువగా యువత సైబర్ నేరాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఆన్లైన్ గేమ్స్, బెట్టింగ్ అప్స్ వల్ల సైబర్ నేరాలకు గురవుతున్నారని, ముఖ్యంగా ఏపీకే ఫైల్స్ ని డౌన్లోడ్ చేయవద్దని, డిజిటల్ అరెస్ట్ అంటూ వచ్చే కాల్స్ కి బయపడవద్దని,యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు ఆకర్షితులవున్నారని, ఎటువంటి లోన్ యాప్స్ లో లోన్ తీసుకుని జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారని అన్నారు.మీకు సైబర్ మోసానికి గురి అయినట్లు తెలిసిన వెంటనే 1930 నెంబర్ కు కాల్ చెయ్యాలని అన్నారు.ఫేక్ ప్రొఫైల్స్ పెట్టుకుని కొంతమంది తెలిసిన వాళ్ళలా మాట్లాడుతూ యూపీఐ ల ద్వారా డబ్బులు అడిగితే పంపవద్దని సైబర్ మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు వెనక్కి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని,1930 నెంబర్ అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల ఎస్సై శ్రీధర్ రెడ్డి, భీమారం గ్రామ సర్పంచ్ స్వాతి సంజీవ్ ,ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మేడిపల్లి కౌన్సిలర్లు నవీన్ ,మేఘమాల, భీమారం గ్రామ ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు గ్రామ ప్రజలు యువకులు తదితరులు హాజరయ్యారు.

# మేడిపల్లి మండల కేంద్రంలో కాంప్లెక్స్ సమావేశం



**నేటి సాక్షి-మేడిపల్లి:** మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేడిపల్లిలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు రాబోయే ఫిబ్రవరి 26వ తేదీన దేశవ్యాప్తంగా మూడవ తరగతి పిల్లలకు జరిగే సర్వే ఫ్లీూా (ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ) ఉంటుందని దీని కొరకు మూడవ తరగతి విద్యార్థులకు ఇప్పటినుండే సన్నద్ధం చేయాలని ఫ్లీూా లో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్స్ ఐ. గోవర్ధన్, వీ.రోజా రాణి, ఆంగ్లంలో గణితంలో పిల్లలకు సులభంగా అర్థమయ్యే విధంగా ఎలా చెప్పవచ్చు చాలా చక్కగా వివరించి చెప్పడం జరిగింది . ఇట్టి కాంప్లెక్స్ సమావేశానికి మండల విద్యాధికారి ఆకుల లక్ష్మి నర్సయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ హమీద్, మాట్లాడుతూ ఫిబ్రవరి 26వ తేదీన జరిగే సర్వేలో పిల్లలను ఇప్పటినుండే సన్నద్ధం చేయాలని దాని కొరకు మనమంతా కష్టపడి మన జగిత్యాల జిల్లాలోని మన మేడిపల్లి మండలాన్ని మొదటి స్థానంలో ఉంచాలని కోరారు. ఇట్టి సమావేశానికి రిసోర్స్ పర్సనల్ గ గోవర్ధన్, రోజా రాణి, సి ఆర్ పి చంద్రశేఖర్, మండలంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జగిత్యాల మున్సిపల్‌లో ప్రారంభమైన ఎన్నికల సందడి

- గ్రామీణ రహదారులు ధ్వంసం అధికారుల నిర్లక్ష్యంపై సీపీఐ నేత పి. వెంకటేష్ ఆరోపణ



**జగిత్యాల - నేటి సాక్షి ( ఇమ్మడి విజయ్ కుమార్ ) :**జగిత్యాల పట్టణంలోని 50 వార్డులో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది.. 28వ తేదీ నుండి 30వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ.. 31వ తేదీ పరిశీలన.. ఫిబ్రవరి మూడవ తేదీ వరకు నామినేషన్ ఉపసంహరణ జరుగుతుందని అదే రోజున తుది జాబితా ఖరారు చేస్తామన్నారు.

### ఫిబ్రవరి 11వ తేదీన జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు ఎన్నికలు..

12వ తేదీన రీపోలింగ్ కోసం ముందు జాగ్రత్తగా ఏర్పాట్లు.. 13వ తేదీ ఫలితాలు వెల్లడి ఈ నెల 28 నుండి ఫిబ్రవరి 13వ తేదీ వరకు 17 రోజులు జగిత్యాల జిల్లాలోని మున్సిపల్ లలో ఎన్నికల వాతావరణం ఉంటుందని తెలిపారు. జగిత్యాల పట్టణంలో గల 50 వార్డులకు గాను రెండు నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో కౌంటర్లు 17 పెట్టామన్నారు. జగిత్యాల చైర్మన్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ చేయబడిందని అన్నారు.

నామినేషన్ల ప్రక్రియ సంబంధించి జగిత్యాల మున్సిపల్ అధికారులు మరియు కమిషనర్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. ఇక జగిత్యాల నియోజకవర్గం పరిధిలోని రాయికల్ లో 12 వార్డులకు ఒక నామినేషన్ కేంద్రం చైర్మన్ పదవి జనరల్ గా కేటాయించారు.. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ స్పందన మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందనీ.. ఒకటో వార్డు నుంచి 21 వ వార్డు వరకు నామినేషన్లు మున్సిపల్ కార్యాలయంలో స్వీకరించబడతాయని ఆర్వోలు కార్యాలయంలో ని మొదటి అంతస్తులో అందుబాటులో ఉంటారన్నారు.. 22వ వార్డు నుండి 50 వ వార్డు వరకు పట్టణంలోని మెప్మా కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ జరుగుతుంది అందుకు సంబంధించి ఆర్వోలు అందుబాటులో ఉంటారని హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని అన్ని విభాగాల సమన్వయంతో నామినేషన్లకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పటిష్టంగా ఏర్పాటు చేసాము.. భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా పోలీసు వారు భద్రత చర్యలు తీసుకున్నారు..

# హ్యాండ్‌బాల్ పోటీలకు ఆదర్శ విద్యార్థినులు



**నేటి సాక్షి, ధర్మారం :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల & కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు వి. అఖిల, బి. శ్రీజ 69వ ఎస్.జి.ఎఫ్ అండర్-19 జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీరు, తెలంగాణ జట్టుకు ఎంపికై జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం గుమార్విన్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరపున పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు బైకాని కొమురయ్య, మేకల సంజీవరావు, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందిస్తూ జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

# సమ్మక్క-సారక్కలను దర్శించుకున్న ఎమ్మెల్యే

**నేటి సాక్షి, కొమరం భీం ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ ఎమ్మెల్యే శ్రీమతి కోవ లక్ష్మి గారు



బూరుగూడ గ్రామంలోని సమ్మక్క-సారక్క అమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఇంటి నుండి డప్పు చప్పుళ్లు, మంగళవాయిద్యాల నడుమ భక్తి శ్రద్ధలతో ఆలయానికి చేరుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారి కుమార్తె అమ్మవార్లకు తన నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి భక్తి చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు మర్సకోల సరస్వతి, గుండి రవీందర్, ఉపసర్పంచ్ మామిడి లక్ష్మి, మాజీ సర్పంచ్ బలరాం, పొన్నాల నారాయణ, ప్రేమ్, సురేష్, సుప్రజ, సంగీత, ఉమ, లలిత తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ పార్లమెంట్ కమిటీలో పాల్గొన్న ఎస్.ఎండీ జమీల్

**నేటి సాక్షి, నందికొట్కూరు:** నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇంచార్జి మాండ్ర శివనందరెడ్డి



గారు, ఎమ్మెల్యే గిత్త జయసూర్య గారి ఆదేశాల మేరకు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ సెంట్రల్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ కమిటీ వర్క్‌షాప్‌లో నంద్యాల జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.ఎండీ జమీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.ఎండీ జమీల్ మాట్లాడుతూ, "పార్టీ అగ్రనాయకత్వం అందించిన సూచనలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. క్రమశిక్షణతో కూడిన పనితీరుతో, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి పథంలోకి తీసుకురావడానికి మేమంతా సైనికుల్లా పనిచేస్తాం. ఈ వర్క్‌షాప్ మాలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు, పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొలువు దీరిన సారలమ్మ



**నేటి సాక్షి గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంతో పాటు మైలారం గ్రామంలో బుర్ర మల్లయ్య ఇంటి నుండి డబ్బు చప్పులతో మంగళ వాయిద్యాల నడుమ ఒగ్గు కళాకారుల సారలమ్మ గద్యపై కొలువు దీరేను సారలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలో సమ్మక్క కమిటీ చైర్మన్ బోయిని పోచయ్య బోయిని మల్లయ్య బుర్ర మల్లయ్య బుర్ర తిరుపతి దేశరాజ్ కనకయ్య న్యాత సుధాకర్ మీసాల ప్రభాకర్ బుర్ర అంజయ్య కూన ఎల్లయ్య కోన మల్లయ్య బుర్ర అనిల్ మహేందర్ బోయిని అంజయ్య మరియు ఆలయ కమిటీ సభ్యులు అందరూ పాల్గొన్నారు

# బాంబు పేలి పాడావుకు గాయాలు



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** చౌడేపల్లి మండలం నాటు బాబు పేలి పాడావు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది .బాధిత రైతు కథనం మేరకు... మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ బూటకపల్లి సమీపంలో గల అడవిలో ఆర్ వెంకటరమణ కు చెందిన పాడావు మేస్తుండగా వన్యప్రాణులకు అమర్చిన నాటుబంబును ఆవు కొరకడంతో అది పేలింది .ఈ ప్రమాదంలో పాడావు తీవ్ర గాయాల పాలయింది ఇటీవల కాలంలో అడవిలో నాటుబంబులు అధికంగా పెడుతున్నారని .సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు.

# ఎస్టీఓలకు ఘన సన్మానం

భగవద్గీతల ప్రదానం



**నేటి సాక్షి - రాయికల్ (ఇమ్మడి విజయ్ కుమార్):** జగిత్యాల సబ్ ట్రెజరీ ఆఫీసర్ మానుక సత్యనారాయణ యాదవ్, వెటర్నరీ శాఖలో విధులు నిర్వహిస్తున్న వెల్పుగొండ కుమార స్వామి యాదవ్‌లను తెలంగాణ యాదవ మహాసభ ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాఖ అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, అప్పాల గంగయ్య యాదవ్, బీనవేని గంగన్న యాదవ్‌లు పాల్గొని శాలువాలు కప్పి, భగవద్గీత గ్రంథాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులుగా వీరు చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. అలాగే బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, 24 సంవత్సరాల సేవ పూర్తయిన ఉద్యోగులు మరియు ఉపాధ్యాయులకు గెజిటెడ్ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘానికి చెందిన ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

# పశువైద్యశాల అధికారికి సన్మానం



**మునగాల, నేటి సాక్షి :** సూర్యపేట జిల్లా మునగాల మండలం రేపాల గ్రామ పశువైద్యశాలలో రైతులు, పశుపాలకులకు నిబద్ధతతో సేవలందిస్తున్న పశువైద్యాధికారిణి మమతను గ్రామ సర్పంచ్ మొగిలిచర్ల సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. పశుసంపద అభివృద్ధి, జంతు ఆరోగ్య పరిరక్షణలో మమత అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మొగిలిచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ, గ్రామంలో పశువైద్యశాల ద్వారా తక్షణ చికిత్సలు, అవగాహన కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవాభావంతో గ్రామానికి సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పశుపాలకులు పాల్గొని పశువైద్యాధికారిణి మమతను అభినందించారు.

# రేపాల జాతర కరపత్రాల విడుదల



**మునగాల, నేటి సాక్షి :** సూర్యపేట జిల్లా మునగాల మండలం రేపాల గ్రామంలో నిర్వహించనున్న స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జాతరకు సంబంధించిన కరపత్రాలను కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఘనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రేపాల గ్రామంలోని స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జాతరకు విశేష చరిత్ర, భక్తుల ఆదరణ ఉందని పేర్కొన్నారు. జాతరను భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహించుకోవాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సారిక చిన్నరామయ్య , యలక నరేందర్ రెడ్డి, బెజవాడ సీతారాములు, గండు వీరబాబు, రావుబుచ్చిరెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులు పల్లి సైదిరెడ్డి, రావులపెంట సతీష్ , తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం ప్రతి కార్యకర్త పని చేయాలి

జగిత్యాల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్



**నేటి సాక్షి - రాయికల్ ( ఇమ్మడి విజయ్ కుమార్ ) :** మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా బుధవారం బిఆర్ఎస్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జగిత్యాల మరియు రాయికల్ పట్టణ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మరియు జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఘన విజయం దిశగా తీసుకెళ్లేందుకు కార్యకర్తలందరూ సమైక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. అనంతరం జగిత్యాల మరియు రాయికల్ పట్టణ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి గా ఎన్నికైన కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ని తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ మరియు రాయికల్ పట్టణ ముఖ్య నాయకులు కలిసి సన్మానించారు. ఈ సమావేశంలో రాయికల్ పట్టణ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తు పరిశీలించిన జిల్లా ఎస్పీ

- నామినేషన్ కేంద్రాల వద్ద 164 బీఎన్ఎస్ (144) సెక్షన్ అమలు
- ప్రజలు సహకరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. బుధవారం నారాయణపేట, మద్దూర్ మున్సిపల్ నామినేషన్ కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 164 బీఎన్ఎస్ (144) సెక్షన్ అమల్లో ఉందని, 200 మీటర్ల పరిధిలో గుంపులు గుంపులుగా ఎవరూ ఉండరాదని స్పష్టం చేశారు. అభ్యర్థితో పాటు ఒకరు లేదా ఇద్దరు ప్రతిపాదకులకే నామినేషన్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ర్యాలీలు నిర్వహించాలన్నా, వాహనాలపై మైక్ వినియోగించాలన్నా ముందస్తుగా పోలీస్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని పేర్కొన్న ఎస్పీ, గత గ్రామపంచాయతీ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయని, మున్సిపల్ ఎన్నికలు కూడా అదే విధంగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఎస్ఐ నరేష్, మున్సిపల్ అధికారులు, స్థానిక పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షులుగా మారం జగదీశ్వర్



- జగదీశ్వర్ ను సన్మానించిన జగిత్యాల జిల్లా ఉద్యోగ సంఘాల నేతలు

**నేటి సాక్షి - జగిత్యాల (పూరెళ్ల బాపు):** అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షులుగా ఎన్నికైన టీఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు మారమ్ జగదీశ్వర్ ను జగిత్యాల జిల్లా ఉద్యోగుల సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు. మారం జగదీశ్వర్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షులుగా తిరిగి ఎన్నికైన సందర్భంగా బుధవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీఎన్జీఓ భవన్ లో జగిత్యాల జిల్లా టీ ఎన్ జీ ఓ అధ్యక్షులు మిర్యాల నాగేధర్ రెడ్డి, జగిత్యాల జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు క్యారంగుల అరుణ, కార్యదర్శి యు. నారాయణ, కోశాధికారి సిహెచ్ సతీష్ కుమార్, రాజేశం, రాజశేఖర్ రెడ్డి, మణి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మాంచి, భవిష్యత్తులో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

# కుక్కల సామూహిక హత్య నివారణపై అవగాహన

**నేటి సాక్షి, చిలుకూరు :** చిలుకూరు గ్రామపంచాయతీ సిబ్బందికి కుక్కల సామూహిక హత్య నివారణ, జంతు హక్కులు, చట్టపరమైన నిబంధనలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుక్కలను చంపడం చట్టవిరుద్ధమని, Animal Birth Control Rules మరియు IPC 428/429 సెక్షన్ల ప్రకారం శిక్షార్హ నేరమని అధికారులు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. వీధి కుక్కల జనాభా నియంత్రణకు ప్రభుత్వం అమలు చేస్తున్న ABC (Animal Birth Control) కార్యక్రమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. స్థానిక వెటర్నరీ వైద్యులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్టెరిలైజేషన్ క్యాంపులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.



## రేబీస్ నివారణపై సూచనలు

కుక్కలను చంపడం రేబీస్ నివారణకు పరిష్కారం కాదని, టీకాలు వేయడం మరియు బాధ్యతాయుత సంరక్షణే సరైన మార్గమని అధికారులు తెలిపారు. గ్రామ ప్రజలకు ఈ అంశంపై అవగాహన కల్పించాలని సూచించారు. జంతువులపై హింస అనైతికం, అమానుషమని ప్రజలకు తెలియజేయాలని, ముఖ్యంగా పిల్లలు, యువతలో జంతు ప్రేమను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కుక్కలపై హింస జరిగినట్లయితే గ్రామపంచాయతీ కార్యాలయం, పోలీస్ స్టేషన్, వెటర్నరీ శాఖకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. సంబంధిత శాఖల సంప్రదింపు వివరాలు ప్రచారం చేయాలని సూచించారు.

గ్రామ సభల్లో ఈ అంశంపై చర్చించాలని, పోస్టర్లు, ఫ్లెక్సీలు, మైక్ ప్రకటనల ద్వారా అవగాహన కల్పించాలని నిర్ణయించారు. గ్రామంలో కుక్కలపై హింస జరగకుండా పర్యవేక్షణ చేయాలని, సమస్యాత్మక కుక్కల విషయంలో వెంటనే వెటర్నరీ అధికారులను సంప్రదించాలని గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు.

# మున్సిపాలిటీ చైర్మన్ పదవుల్లో ఎస్టీలకు తీవ్ర అన్యాయం

- లంబాడీల ఐక్య వేదిక ఆగ్రహం
- జీఓ నెంబర్ 14 ప్రకారం రావాల్సిన 7 చైర్మన్ పోస్టులౌ ఇచ్చింది కేవలం 5 మాత్రమే
- గిరిజనులకు న్యాయం చేయకపోతే కాంగ్రెస్ లోని గిరిజన నేతలే బాధ్యత వహించాలి : జాదవ్ రమేష్ నాయక్




**నేటి సాక్షి మహబూబాబాద్(భూక్యా రవినాయక్):** రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో ఎస్టీలకు చైర్మన్ పదవుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త జాదవ్ రమేష్ నాయక్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో మొత్తం 123 మున్సిపాలిటీలు ఉండగా, ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ఎంఎస్ నెంబర్ 14 (తేదీ: 13-01-2026) ప్రకారం ఎస్టీలకు కేవలం 5 చైర్మన్ పోస్టులు మాత్రమే కేటాయించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అయితే జనాభా నిష్పత్తి ప్రకారం చూస్తే ఎస్టీలకు కనీసం 7 చైర్మన్ పదవులు రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మున్సిపాలిటీల్లో మొత్తం 2,996 వార్డులు ఉండగా, అధికారిక అనెక్సర్ ప్రకారం ఎస్టీలకు కేవలం 180 వార్డులు మాత్రమే కేటాయించారని తెలిపారు. ఇది మొత్తం వార్డుల్లో 6 శాతం మాత్రమే అవుతుందని అన్నారు.

2011 జనగణన ప్రకారం రాష్ట్రంలో ఎస్టీ జనాభా శాతం 5.8 శాతంగా ఉన్నప్పటికీ, చైర్మన్ పదవుల్లో మాత్రం కేవలం 4.13 శాతం మాత్రమే కేటాయించడం ఏ విధంగానూ సమంజసం కాదని మండిపడ్డారు. ఇది స్పష్టమైన వివక్షకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఉన్న గిరిజన నాయకులు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న గిరిజన ప్రజాప్రతినిధులు ఈ అన్యాయానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎస్టీలకు న్యాయం చేయడంలో వారు విఫలమైతే, భవిష్యత్తులో జాతి ద్రోహులుగా మిగిలిపోతారని జాదవ్ రమేష్ నాయక్ తీవ్ర హెచ్చరిక చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించి, జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్టీలకు రావాల్సిన 7 చైర్మన్ పదవులు కేటాయించాలని లంబాడీల ఐక్య వేదిక డిమాండ్ చేసింది.

# తండ్రికి తగ్గ తనయుడు!

## జగిత్యాల మున్సిపల్ 8వ వార్డు బరిలో కైర అజయ్ గౌడ్

## పేదల నేస్తం.. అభివృద్ధి దిశగా అడుగులు

## సేవా స్ఫూర్తితో రాజకీయ రంగప్రవేశం



'కైర అజయ్ గౌడ్' ఇప్పుడు ఒక యువ సంచలనం.! నిన్నమొన్నటి దాకా 'సేవా రంగం'లో ఉండి.. ఇప్పుడు రాజకీయ రంగప్రవేశం చేసి 'తండ్రికి తగ్గ తనయుడు'గా తెరపైకి వచ్చాడు.! జగిత్యాల మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు కౌన్సిలర్ పదవికి యువ నాయకుడు కైరా అజయ్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఈమేరకు ఆయన గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు.

*- నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య)*



### రాజకీయ 'వారసుడొచ్చాడు'

పేద ప్రజలకు నేస్తంగా మారి, వార్డు అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ఆయన ముందుకు వచ్చారు. ఆయన తండ్రి భూమా గౌడ్ రాజకీయ అనుభవంతో పాటు, 'సత్యసాయి బాబా సేవా ట్రస్ట్' ద్వారా ఆయన చేస్తున్న సేవలు ఆయనను ప్రజలకు దగ్గర చేశాయి. ఈ మున్సిపల్ ఎన్నికల ద్వారా వార్డు ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఆయన సిద్ధమయ్యారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి అనుచరుడిగా గుర్తింపు పొందిన ఆయన తండ్రి భూమా గౌడ్ అడుగుజాడల్లో నడుస్తూ.. స్వచ్ఛంద సేవలతో ఇప్పటికే ప్రజల మనసులు గెలుచుకున్నారు. ఈ ఎన్నికలు వార్డు అభివృద్ధికి కొత్త మలుపు తిరగనున్నాయని ఆయన అనుచరులు భావిస్తున్నారు.

### రాజకీయ వారసత్వం - అనుభవం

కైరా అజయ్ గౌడ్ రాజకీయ నేపథ్యం ఆయన తండ్రి భూమా గౌడ్ నుంచి వచ్చింది, ఆయన సర్పంచ్ గా రెండు సార్లు మరియు కౌన్సిలర్ గా పని చేసి రాజకీయ అనుభవాన్ని సంపాదించారు. ఈ వారసత్వం ఆయనకు రాజకీయ జ్ఞానాన్ని, ప్రజల సమస్యలపై అవగాహనను అందించింది. మాజీ మంత్రి జీవన్ రెడ్డి ముఖ్య అనుచరుడిగా ఆయన గుర్తింపు పొందడం ద్వారా కాంగ్రెస్ పార్టీలో ఆయన స్థానం బలపడింది. ఈ అనుభవం ఆధారంగా ఆయన వార్డు సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధమయ్యారు. జగిత్యాల ప్రాంతంలో రాజకీయంగా చురుకైన వాతావరణం ఉండటంతో, ఆయన నాయకత్వం కొత్త ఆశలు రేపుతోంది. ప్రజల మధ్య ఆయన తండ్రి సేవలు ఇప్పటికీ గుర్తుండటం వల్ల, ఆయనకు మద్దతు పెరుగుతోంది. ఈ రాజకీయ ప్రయాణం యువతకు స్ఫూర్తిగా నిలుస్తుంది, ఎందుకంటే ఆయన వయస్సు తక్కువైనా అనుభవం మాత్రం ఎక్కువగా ఉంది. భవిష్యత్ లో ఆయన నాయకత్వంలో వార్డు అభివృద్ధి చెందుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. రాజకీయంగా పరిపక్వత కలిగిన ఆయన, పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడం ద్వారా తన సామర్థ్యాన్ని చూపించారు.

### అభివృద్ధి లక్ష్యాలు - ప్రణాళికలు

కైరా అజయ్ గౌడ్ వార్డు కౌన్సిలర్ గా ఎన్నికైతే అభివృద్ధిని ముందుంచుకుని పని చేస్తానని చెప్పారు, ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ప్రధాన లక్ష్యం. జగిత్యాల మున్సిపల్ వార్డు 8లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఆయన ప్రణాళికలు సిద్ధం చేశారు. పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, విద్యా సంస్థలను అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలు ఆయన ఎజెండాలో ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ విధానాలను అమలు చేసి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం ఆయన ధ్యేయం. ఈ అభివృద్ధి ప్రణాళికలు వార్డు ప్రజల జీవన ప్రమాణాలను పెంచుతాయి, ఆర్థికంగా బలోపేతం చేస్తాయి. ఆయన అనుభవం మరియు సేవా స్ఫూర్తి కలిసి వచ్చి, వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతాయి. ప్రజలతో సమన్వయం చేసుకుని పని చేయడం ద్వారా, సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని ఆయన అన్నారు. ఈ లక్ష్యాలు సాధించడానికి ఆయన పార్టీ మద్దతు మరియు ప్రజల సహకారం కీలకమని చెప్పారు. అభివృద్ధి పనులు పారదర్శకంగా జరిగేలా చూస్తానని ఆయన వాగ్దానం చేశారు.

### సేవా కార్యక్రమాలు - స్వచ్ఛంద స్ఫూర్తి

కైరా అజయ్ గౌడ్ 'సత్యసాయి బాబా సేవా ట్రస్ట్' ద్వారా స్వచ్ఛందంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు, ముఖ్యంగా కార్మికులు, విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి వారి విద్యను ప్రోత్సహించారు. ఈ సేవలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయి, వారి జీవితాల్లో కొత్త కాంతిని నింపాయి. స్వచ్ఛంద సంస్థ పేరుతో ఆయన నిర్వహించిన కార్యక్రమాలు ప్రజల మధ్య ఆయనను ఒక సేవకుడిగా గుర్తింపు తెచ్చిపెట్టాయి. కళ్యాణ లక్ష్మీ, రేషన్ కార్డులు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు వంటి ప్రభుత్వ సహాయాలను పేదలకు అందజేయడంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి పెళ్లి సంబంధాలలో సాయం చేయడం, వారికి భరోసా కల్పించడం ఆయన సహజ స్వభావం. ఈ సేవలు జగిత్యాల ప్రాంతంలోని అనేక కుటుంబాలకు ఆసరాగా నిలిచాయి, వారి జీవితాలను మార్చాయి. స్వచ్ఛంద సేవలు ఆయన రాజకీయ ప్రవేశానికి పునాది వేశాయి, ప్రజల విశ్వాసాన్ని పెంచాయి. భవిష్యత్ లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదల ఉద్ధరణకు కృషి చేస్తానని ఆయన వాగ్దానం చేశారు. ఈ స్ఫూర్తి యువతకు మార్గదర్శకంగా ఉంటుంది, సమాజ సేవలో పాల్గొనేలా ప్రేరేపిస్తుంది.

### భవిష్యత్ ఆశలు - ప్రజల మద్దతు

కైరా అజయ్ గౌడ్ గెలుపు ద్వారా వార్డు ప్రజలలో కొత్త ఆశలు చిగురించనున్నాయి. ఆయన చూపే మానవత్వం మరియు సేవా స్ఫూర్తి ప్రజలను ఆకర్షిస్తున్నాయి. ఎన్నికలలో ఆయనకు మద్దతు పెరుగుతోంది..ముఖ్యంగా పేదలు మరియు యువత నుంచి. ఆయన భవిష్యత్ ప్రణాళికలు వార్డును సమగ్రంగా అభివృద్ధి చేసే విధంగా ఉన్నాయి, స్థానిక సమస్యలను పరిష్కరించడంతో పాటు దీర్ఘకాలిక లక్ష్యాలు కూడా ఉన్నాయి. ప్రజలతో నిరంతర సంబంధాలు నిర్వహించడం ద్వారా, ఆయన వారి అభిప్రాయాలను స్వీకరిస్తారు. ఈ మద్దతు ఆయనను విజయవంతం చేస్తుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు. జగిత్యాల ప్రాంతంలో రాజకీయ మార్పులకు ఆయన ప్రవేశం ఒక ముఖ్యమైన అడుగు. భవిష్యత్ లో ఆయన నాయకత్వంలో వార్డు ప్రగతి పథంలో పయనిస్తుంది, ప్రజల జీవితాలు మెరుగుపడతాయి. ఈ స్ఫూర్తివంతమైన ప్రయాణం ఇతర యువ నాయకులకు మార్గదర్శకంగా నిలుస్తుంది, సమాజ సేవను ప్రోత్సహిస్తుంది. ఆయన విజయం పేదల విజయంగా మారుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.!

---



# బాలికను కాటేసిన 'కామాంధుడు'!



## 14 ఏళ్ల మైనర్‌పై అఘాయిత్యం

## 'బాలిక ప్రసవం'తో బయటపడిన సిరికొండ దుర్ఘటన

**నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య)**

'ఆ-ఇంటికి' స్నేహం కోసం తరచూ వెళ్లిన పాపానికి..ఒక మైనర్ బాలిక జీవితాన్నే అంధకారంలోకి నెట్టింది.! చదువుతో భవిష్యత్తు కలలు కంటున్న 14 ఏళ్ల బాలిక.. తనకే తెలియని వయసులో తల్లిగా మారిన ఈ సంఘటన సభ్యసమాజాన్ని నివ్వెరపోయేలా చేసింది.! కూతురి స్నేహితురాలైన ఆ 9వ తరగతి చదువుతున్న ఆ బాలికను..మాయమాటలతో వెళ్లిన ప్రతీసారి 'లైంగిక దాడి' చేశాడా కామాంధుడు.! చివరికి 'ఆ-బాలిక' అనూహ్యంగా గర్భం దాల్చి..ప్రసవించడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది.'చేతులు కాలాకా - ఆకులు పట్టుకున్న' చందంగా..అంతా.. సర్వనాశనం అయ్యాక బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు.దీంతో ఆగ్రహించిన పోలీసులు 'కామంతో కళ్లు మూసుకుపోయిన కామాంధుడి'పై 'పోక్సో' చట్టం కింద కేసు నమోదు చేశారు.ఈ ఉదంతం జగిత్యాల జిల్లాలో కలకలం రేపింది.!

### ఇంట్లోనే..'మాటేసి-కాటేసి'న కామాంధుడు.!

జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం సిరికొండ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేసింది. స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలిక, అదే తరగతిలో చదువుతున్న తన స్నేహితురాలి వద్దకు చదువు సందేహాలు అడగడానికి తరచూ వెళ్లేది. ఆ స్నేహాన్ని అవకాశంగా మలుచుకున్న స్నేహితురాలి తండ్రి, తన తండ్రి వయసులో ఉన్న వ్యక్తి, ఏమీ తెలియని బాలికపై కామ కోరికలు పెంచుకుని జంతువులా ప్రవర్తించాడు. నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని చేసిన ఈ అఘాయిత్యం ఆమె జీవితాన్నే మలుపు తిప్పింది.!

### ప్రసవంతో వెలుగులోకి వచ్చిన నేరం

గర్భం విషయం తెలిసిన తరువాత తల్లి తీవ్ర మనోవేదనకు గురై, కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిని ఆశ్రయించింది. మొదట డెలివరీకి నిరాకరించిన ఆసుపత్రి యాజమాన్యాన్ని తల్లి బతిమాలడంతో చివరకు ప్రసవం నిర్వహించారు. అదే సమయంలో ఆసుపత్రి యాజమాన్యం 'చైల్డ్ వెల్ఫేర్ డెవలప్మెంట్' అధికారులకు సమాచారం అందించడంతో ఈ దారుణ ఘటన బయటపడింది.

### చెప్పుకోలేని వేదనా మౌనంగా మోసిన బాధ.!

'లైంగిక బాధితురాలైన' ఆ బాలిక తండ్రి ఉపాధి కోసం దుబాయ్‌కు వెళ్లగా, తల్లి కూలీ పనులతో కుటుంబాన్ని పోషిస్తోంది. ముగ్గురు కూతుళ్లలో చిన్నదైన ఈ బాలిక, తనపై జరిగిన అన్యాయాన్ని ఎవరికీ చెప్పుకోవాలో తెలీక..మౌనంగా బాధను మోసింది. పరువు పోతుందనే భయంతో, ఏమి జరుగుతుందో తెలియక 'తొమ్మిది నెలల' పాటు గర్భం దాల్చిన విషయాన్ని బయటపెట్టలేకపోయింది. ఆ పసి మనసు ఎంతటి భయంతో, ఎంతటి గందరగోళంతో రోజులు గడిపిందో ఊహించడమే హృదయాన్ని కలిచేస్తుంది.!

### చట్టం స్పందించింది-నిందితుడిని పట్టుకుంది

చైల్డ్ వెల్ఫేర్ డెవలప్మెంట్ అధికారి సంబంధిత సర్కిల్ ఇన్స్పెక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. డెలివరీ చేసిన వైద్యుల నివేదికల ఆధారంగా 'కామాంధుడి'పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అతడిని అదుపులోకి తీసుకున్నట్లు ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఆ 'పార్టీ' టికెట్.. చాలా 'కాస్ట్లీ' అంట గురూ.!

## జస్ట్ రూ.15 లక్షలేనంట!?




- పంట పండించుకునే 'ప్లాన్' వేసుకున్నడంట.? ఆ 'ద్వార పాలకుడు'.?
- పేమెంట్ ఇచ్చి 'బీ-ఫామ్' కొనుక్కునుడా.?..హవ్వ.!
- లాస్ట్ మూమెంట్ లో 'పార్టీ మారుడా'.?
- ఇప్పటికిప్పుడు 'కండువా' మార్చితే.? తాము 'ప్యారాచ్యూట్' నేతలమేగా.? అంటూ ఆశావాహుల 'మల్లగుల్లాలు'.!
- ఈ 'చాటు-మాటు'.. 'బేరసారాలు' 'పెద్దాయన'కు తెలిసి జరుగుతున్నాయా.? లేక 'అయ్యగారి కట్నం' పేరిట 'హాంఫట్టా'.?
- నామినేషన్‌ల సమయాన 'ఇదేం ఫిట్టింగ్'రా.. ద్యావుడా.?



'దీపముండగానే.. ఇల్లు చక్కబెట్టుకోవాలె..' అని పెద్దలు చెబుతుంటారు.! సరిగ్గా ఓ 'పార్టీ'కి చెందిన 'ప్రధాన-ద్వార పాలకుడు' ఇప్పుడు ఇదే చేస్తూ 'జేబులు' కాదు 'సూటు కేసు'లే నింపుకుంటున్నట్టు కోరుట్ల పట్టణంలో గుప్పుమంది.! 'నిప్పులేనిదే పొగ రాదు' కదా.? 'ఆ-పార్టీ' ఇప్పుడు మంచి 'రైజింగ్'లో ఉందాయె మరి.! ఎట్టకేలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో 'కౌన్సిలర్'గా పోటీచేసేందుకు లెక్కకు మించి 'ఆశావాహులు' ఆయా పార్టీల 'టిక్కెట్'ల కోసం దరఖాస్తులు చేసుకుని 'క్యూ'లో ఉన్నారు.! ఇప్పుడు ఇదే అదునుగా 'ఓ ద్వారపాలకుడు' అందినకాడికి జేబులు నింపుకునే పనిలో పడ్డారన్న ప్రచారం జరుగుతోంది.!

*- నేటి సాక్షి, కోరుట్ల(రాధారపు నర్సయ్య)*



### జెండా మోసినోడికి కాదు.. బ్యాగులు తెచ్చేటోడికే 'టిక్కెట్'.!

కాకరకాయ చేదు తెలీకుండా బెల్లం వేసి 'స్వీట్ కోటింగ్' ఇచ్చినట్టు..'గెలుపు గుర్రాల'కే టికెట్ అని 'భజన మీడియా'కిచ్చే అందమైన హెడ్ లైన్ వెనుక ఇంత 'మ్యాటర్' దాగి ఉందాని..ఆ పార్టీ 'జీవితకాలపు జెండా కూలీలు' చెవులు కొరుక్కుంటున్నారు.! అన్న.. జిందాబాద్..అన్న యువసేన.. అన్న.. ముసలిసేన అంటూ బానిసత్వం ప్రదర్శిస్తూ ఐదేళ్లకోసారి వచ్చే మున్సిపల్ ఎన్నికల్లోనే పోటీ చేద్దామని ఏళ్లుగా ఎదురుచూసే 'నిఖార్సైన నాయకుల' ఆశలపై బడా 'ప్యారాచ్యూట్' నేతలు బకిట్లకొద్దీ నీళ్లు కుమ్మరించేస్తున్నారు.దీంతో 'ఆ ఖరీదైన-టిక్కెట్' కొనలేని 'నిరుపేద ఆశావాహులు' చిన్న సైజు అధినేతల' కరుణాకటాక్షాల కోసం ఆ మెట్ల దగ్గరే పడుగాపులు కాస్తున్నారు.!



### టికెట్ ప్లీజ్.. జస్ట్ రూ.15 లక్షలకే క్లోజ్.!

ఈ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలంటే కనీసం '6-గురు ఆశావాహుల' నుంచి దరఖాస్తులను ఆ పార్టీ ఆదేశించింది.! దీంతో..ఏళ్ల నుంచి తాము చేసిన సేవలకు గుర్తింపుగా..తమకే టికెట్ వస్తుందని కొందరు.. లేదు ఇదివరకే గెలిచి 'మాజీ'లమయ్యాం..మేమే గెలుస్తాం 'సిట్టింగ్'లకే టికెట్ అని 'విఐపి-ఆశావాహులు' రేసులో ఉన్నామని ధీమాగా ఉన్నారు.అదేం లేదు.. ఎల్లకాలం వాళ్లకేనా టికెట్లు.? ఇక మేమెన్నడు పోటీ చేసేది.? అంటూ 'ప్రజా బలముందని' మరికొందరు రేసులోకి 'దరఖాస్తు ఫారం' పట్టుకుని 'క్యూ' లైన్ లో నిలబడి ఉన్నారు.'రేసు గుర్రాల'కే టికెట్ అని..'సర్వే'లో ఎవరు గెలుస్తారో అని వచ్చిన 'రిపోర్ట్' ప్రకారం 'బీ-ఫారం' ఇస్తామని పేర్కొంటూన్నప్పటికీ..'బ్యాగు'లు తెచ్చే 'ప్యారాచ్యూట్' నేతలపై కన్నేసినట్లు సమాచారం.అయితే.. 'ఆ-నేతలు' ఎలాగూ 'విచ్చలవిడిగా' ఖర్చు చేస్తారని అర్థమైందో అప్పుడే 'ఆ-ద్వారపాలకుడు' ఇసుంటి 'మాస్టర్ ప్లాన్'వేసినట్టు గుసగుసలు మొదలయ్యాయి.దీంతో ఒక టికెట్ ధర రూ.15 లక్షలు నిర్ణయించి 'నామినేషన్' టైం లో 'మీ ఇష్టం' అంటూ 'తిరకాసు' పెట్టినట్టు కనిపిస్తోంది.కాగా..'రోట్లో తలకాయ పెట్టి..రోకలి దెబ్బకు భయపడుడెందుకు' అని 'ఆ ఖరీదైన ఆశావాహులు' అన్నీ మూసుకుని రూ.15 లక్షలు సమర్పించుకుంటున్నట్టు తెలియవచ్చింది.!

### ఐతే.! ఇది 'చాటు-మాటు' వసూళ్లా.? లేక 'తెలిసి' జరుగుతున్న 'స్క్రిప్ట్ వర్కా'.?

ఇందులో.. 'మతలబేదో..' ఉన్నట్టు ఆ పార్టీ నేతలే చెవులు కొరుక్కుంటున్నట్టు సమాచారం.! నిజానికి తమ వార్డులో ఎన్ని ఓట్లు ఉన్నాయి.? ఎంత మంది బరిలో ఉంటారు.? అవతలి వాళ్ళు ఎంతమేర బలవంతులు.? గెలుపోటములు శాశించేంత కెపాసిటీ ఉందా.? రెబెల్స్ ఉంటారా.? ఉంటే వారు చీల్చే ఓట్లేన్ని.? అందరూ పంచుకోగా తాము బయటపడతామా.? మెజారిటీ వస్తుందా.? లేక 'నెక్' టు 'నెక్' ఉంటుందా.? మహిళా సంఘాలు..కుల సంఘాలు..యూత్ సంఘాలు.. కమ్యూనిటీ ఓట్లు.. విందులు.. మందులు..ప్రచారం వంటి ఎన్నో ఖర్చులు.. లెక్కలు చూసుకుంటున్న 'ఈ-నేతలు' పోన్లే ఖర్చులో ఖర్చు అని సరిపెట్టుకుంటున్నట్టు తెలియవచ్చింది.కానీ..ప్రజాబలాన్ని..పార్టీకి చేసిన సేవను నమ్ముకున్న వారు మాత్రం మింగుడుపడక అక్కడక్కడా 'ద్వారపాలకుడి' వసూళ్ల గేమ్ ను గురించి ముచ్చటించుకుంటున్నారు.



### పార్టీ మారుడా.?.. ప్యారాచ్యూట్ నేతలకు కోపరేట్ చేసుడా.?

సరే.. 'నోస్క పుట్టినోడికి.. నోముకాడి అప్ప' దొరుకుందంటారు.ఏళ్లుగా తమ భుజాలమీద జెండా మోసినోడికి ఏ పార్టీలోనూ తగిన గుర్తింపు.. ప్రాధాన్యత ఉండదన్నది 'రాజకీయ బుక్కు'లో రాయబడిన ఓ పేరాగ్రాఫేనాయె.! అయితే.. 'ద్వారపాలకుడు' వసూలు చేస్తున్న ఆ రూ.15 లక్షలు ఇచ్చుడా.? లేక 'ఛల్ నీయవ్వ-తొక్కలో పార్టీ' అని పక్కపార్టీలోకి జంపై కండువా మార్చుడాని 'బాధిత ఆశావాహులు-గొల్లుమంటున్నారు'.! కానీ.. తాము ఇన్నేళ్లు ఇందులో ఉండి.. ఇప్పటికిప్పుడు పార్టీ మారితే తాము కూడా 'ప్యారాచ్యూట్' నేతలవే ఐతంగదాని 'మల్లగుల్లాలు' పడుతున్నారు.



### గతంలోనూ.. 'పార్టీ సొమ్ము-స్వాహా'నంట.!

ఇప్పుడు ఈ మున్సిపల్ ఎన్నికల్లోనే గాక..గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంత.. లోక్ సభ ఎన్నికల్లో ఇంకొంత..'పార్టీ సొమ్మును..' సుబ్బరంగా స్వాహా చేసినట్టు వెలుగులోకి వచ్చింది. ఈయనగారికి ఇలాంటి 'జాన్ జిగిరి' దోస్త్ కూడా జతై 'చెరింత' నాకేసినట్టు ఆ పార్టీ నేతలే చెవులు కొరుక్కుంటున్నారు.ఐతే.! ఇప్పుడు ఈ 'కాస్ట్లీ' టికెట్ ధరను 33 వార్డుల్లో పోటీ చేసే ఆశావాహులు 'చెల్లించారా'.? లేక 'ఓన్లీ-ఛైర్ పర్సన్' అభ్యర్థులు మాత్రమే చెల్లిస్తున్నారన్నది ఇంకా స్పష్టంగా తెలియరాలేదు.కానీ..ఏదిఏమైనా.? రోజూ 'రాసుకు-పూసుకు' తిరిగే మిత్రులు ఇవాళ పోటీ చేద్దామని ఆశపడి 'టికెట్' అడిగితే..'పైసల్ కట్టు - ఫారం పట్టు'కుపోమని తెగేసి చెప్పడం ఎంతవరకు కరెక్ట్ అని చెల్లించే స్థోమత లేని ఆశావాహులు 'గొల్లుమంటున్నారు'.!

